THE LARGEST CIRCULATED TELUGU DAILY FROM THE CAPITAL

గోలకొండపత్రిక

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి, ఎం. ఏ.

100110

సంపుటి 18 సంచిక 197 ‖ హైద్రాబాదు మంగళవారం 27 జులై 1965 4 పేజీలు 7 పైసలు ‖ స్థాపితం: 1926 రి నెం. H 92

ఇండియా-సోవియట్ ఐదేండ్ల వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ, జులై 26

1964 లో రు. 75 కోట్లుగల ఇండియా-సోవియట్ వాణిజ్యం 1970 వరకు రు. 150 కోట్లు కాగలదని నేడు అధికారికంగా వెల్లడింపబడింది.

ఈ సంవత్సరం అక్టోబర్ లో 1966-1970 సంవత్సరాలకై ఉభయ దేశాలు కొత్తవాణిజ్య ఒప్పందాన్ని చేసుకుంటాయి. ఈ ఒప్పందంపై ఢిల్లీలో సోవియట్ వాణిజ్యమంత్రి పాటోలిచెవ్ సంతకం చేస్తారు. భారత ప్రభుత్వ పక్షాన కేంద్ర వాణిజ్యమంత్రి షా సంతకం చేస్తారు.

హైద్రాబాద్ నగరానికి కిరోసిన్ సరఫరా

హైద్రాబాద్, జులై 26.- హైద్రాబాద్ నగరంలో ఏర్పడిన కిరోసిన్ కొరత నివారణకై బొంబాయినుండి పదకొండు టాంకు వాగన్లనిండా ఈనెల 22వ తేదీన కిరోసిన్ తెప్పించబడింది.

జులై 24వ తేదీన గూడా మరో 11 టాంక్ వాగన్ల కిరసనాయిల్ తెప్పించబడింది. ఇంకొక 84 టాంకు వాగన్లలో బొంబాయినుండి ప్రత్యేక రైలు హైద్రాబాద్ కు కిరసనాయిలును తీసుకొని రాగలదు.

ఈమధ్య ఆంధ్ర ప్రదేశ్ సివిల్ సప్లయిస్ జాయింట్ డైరెక్టరు బొంబాయి వెళ్ళి కిరోసిన్ సరఫరాకొరకు సంప్రదింపులు జరిపి వచ్చారు.

రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశ ప్రారంభం

ఐదవ ఉక్కు కర్మాగారం ఆంధ్రప్రదేశ్ కు లభిస్తుందని గవర్నర్ విశ్వాసం

హైద్రాబాదు, జులై 26

విశాఖ పట్టణములో అయిదవ ఉక్కు కర్మాగార స్థాపనకు కేంద్రం అంగీకరించ గలదనే విషయములో సందేహంలేదని, సికింద్రాబాద్ కేంద్ర స్థానముగా కొత్త రైల్వే మండలం త్వరలో పని చేయుటకు అవసరమయిన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వము సమకూరుస్తున్నదని రాష్ట్ర గవర్నర్ శ్రీ పట్టంతాను పిళ్ళె పేర్కొన్నారు.

రాష్ట్ర శాసనసభ, శాసన మండలి వర్షాకాల సమావేశం నేడు ప్రారంభమయింది. గవర్నర్ శ్రీ పట్టంతానుపిళ్లె వీని సంయుక్త సమావేశాన్ని ప్రారంభించారు.

శాసనమండలి అధ్యక్షులు శ్రీ జి. బ్రహ్మయ్య శాసనసభ స్పీకర్ శ్రీ బి. వి. సుబ్బారెడ్డి లెజిస్లేచర్ కార్యదర్శి శ్రీ జి. వి. చౌదరి ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ప్రారంభించ వచ్చిన గవర్నర్ కు స్వాగతం చెప్పారు. అసెంబ్లీ గ్యాలరీలన్నీ సభ్యులతో నిండినవి. అయిదవ ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పుటకయి అంగ్లో అమెరికన్ నిపుణుల బృందం సూచించినట్టు విశాఖపట్టణాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తుందనడములో సందేహంలేదని, సికింద్రాబాదు కేంద్రంగా కొత్త రైల్వే మండలం ఏర్పరచ బడుతున్నదని ఆంధ్రప్రదేశ్ ఈ విధంగా అభివృద్ధి పథములో పురోగమిస్తున్నదని కాని అభివృద్ధి సాధన మార్గం చాలా దీర్ఘమయినదని గవర్నర్ తమ ప్రసంగములో సూచించారు. నాగార్జునసాగర్ మీదుగా ఒంగోలు హైద్రాబాదుల మధ్య రైల్వేలైను ఏర్పాటుచేయ సర్వే చేపట్ట బడుతుందని ముందు ఈ లైను సిర్పూర్ కాగజ్ నగర్ వరకు విస్తరింపబడుతుందని మరో బ్రాడ్ గేజి లైను కొత్తగూడెం నుండి కొవ్వూరుకు వేయబడుతుందని గవర్నర్ సూచించారు. రు 2.15 కోట్ల వ్యయంతో రాజమండ్రి వద్ద నిర్మించబడే రైలు రోడ్డు బ్రిడ్జి ఉత్తరాన కలకత్తా దక్షిణాదిన మద్రాసులో గల పారిశ్రామిక కేంద్రాలతో ఆంధ్ర ప్రదేశ్ సంబంధాలను ఇనుమడింప గలదని గవర్నర్ ఆశించారు.

ఇంకా గవర్నర్ తమ ప్రసంగంలో మూడవ పంచవర్ష ప్రణాళికను ప్రస్తావించారు ఈ ప్రణాళికా వ్యయం రు. 350 కోట్లకు చేరుతుందన్నారు. నాల్గవ ప్రణాళిక ముగియగా నాగార్జున సాగర్ శ్రీశైలం ప్రాజెక్టుల మినహాయించి రు. 700 కోట్ల వరకుండగలదన్నారు. ఈరెండు ప్రాజెక్టుల కేంద్రం చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయగలదన్నారు. నాల్గవ ప్రణాళికా కాలములో వ్యవసాయోత్పత్తిని హెచ్చించడముతో పాటు పారిశ్రామిక అభివృద్ధిని సాధించాలన్నారు.

జగిత్యాల ఆర్ట్సు సైన్సు కళాశాల

హైద్రాబాద్, జులై 26

కరీంనగర్ జిల్లా జగిత్యాలలో ఈ విద్యాసంవత్సరంనుండి ఆర్ట్సు సైన్సు కళాశాల ప్రారంభమవుతుంది.

కరీంనగర్ జిల్లా విద్యాసంస్థ ఈ కళాశాలను ఏర్పరచినది.

గవర్నర్ ప్రసంగంపై వ్యాఖ్యానాలు

ప్రజల నిత్యజీవిత సమస్యలపట్ల ప్రస్తావనే లేనందుకు పలువురి విమర్శ

హైద్రాబాద్, జులై 26

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల్ని ప్రారంభిస్తూ ఈఉదయం ఉభయ శాసనసభల సంయుక్త సమావేశములో ప్రసంగిస్తూ రాష్ట్ర గవర్నరు శ్రీ పట్టంతానుపిళ్ళె మిన్నంటుతున్న ధరల్ని గురించి, కిరోసిన్ కొరతను గురించి, అధికార భాషగా తెలుగును ప్రవేశపెట్టే కృషిని గురించి ప్రస్తావించక పోవడాన్ని పలువురు ప్రతిపక్షాల నాయకులు విమర్శించారు.

ప్రతిపక్ష నాయకుడు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు భారతరక్షణ నిబంధనలు రద్దు పరచబడనందుకు విచారం వ్యక్తపరిచారు. ఇక అధికధరలవల్ల, కిరోసిన్ కొరతవల్ల, ఆహార పదార్థాల కొరత ఉన్నప్పటికీ ప్రభుత్వము నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంవల్ల ప్రజలకు కలుగుతున్న కష్టాలమాట పట్టనేలేదు. ఇప్పటికే పన్నుల భారముతో కుంగిపోతున్న ప్రజలమీద అదనముగా పన్నులు వేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. విద్యాశాఖ డైరెక్టొరేటును రెండుగా చీల్చవలసిన అవసరములేదు. తెలుగు అధికార భాష చేయబడుతుందన్న ముఖ్యమంత్రి వాగ్దానము విస్మరింపబడింది. ఎన్. జి. ఓ. లకిచ్చిన సహాయము ఎందుకూ కొరగానిది అని శ్రీ వెంకటేశ్వర్లు విమర్శించారు.

నేషనల్ డెమొక్రాట్స్ నాయకుడు శ్రీ తెన్నేటి విశ్వనాథం ప్రజా సమస్యలపట్ల గవర్నర్ ప్రసంగములో ప్రస్తావనే లేకపోవడాన్ని విమర్శించారు. రానున్న జనరల్ ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి సప్లయి పథకాల త్వరితపూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని ఒక ఆశ చూపించినా అధికపన్నుల ప్రతిపాదనలు ఈఆశను కుంగదీసేవన్నారు.

శాసనసభ సభ్యుడు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు ఎగుమతులకు సంబంధించినంతవరకూ ఆహార పరిస్థితి బాగువడుతున్నట్లే ఉందని విశాఖపట్నం మొదలైన కొరత ప్రాంతాలలో పరిస్థితి మరీ క్లిష్టమవుతున్నదనీ అన్నారు. గవర్నర్ ప్రసంగంలో తెలుగు అధికార భాషగా కాలించే ప్రస్తావన ఉంటే బాగుండేదన్నారు. మూడు సంవత్సరాల తర్వాత కూడా కౌలుదారీ బిల్లు ప్రస్తావన లేకపోవడం విచారకరమని ఆయన అన్నారు.

స్వతంత్ర సభ్యుడు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య వ్యాఖ్యానిస్తూ గవర్నర్ ప్రసంగం ఏదో సింహాసనంనుండి చేసే లాంఛనప్రాయ ప్రసంగంగా ఉందిగాని నిజమైన దైనందిన సమస్యలను గుర్తించిన ప్రసంగంగా లేదన్నారు. విద్యా సంస్కరణలు మరింత గందరగోళ పరిస్థితిని సృష్టించగలవనీ, ఆహార తదితర అవసర పదార్థాల విషయమే ప్రసంగంలో లేదనీ శాసనసభా సెక్రటేరియట్ సంస్కరణ ఒక రాజ్ ప్రతిపాదన వంటిదనీ ఆయన పేర్కొన్నారు.

స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ గౌతు లచ్చన్న ప్రభుత్వోద్యోగులకు గాను ప్రకటించిన సహాయము కంటి తుడుపు వ్యవహారంగా ఉందని అభిప్రాయము వెల్లడించారు క్రితముసారి శాసనసభా సమావేశ సమయములో వెనుకబడినతరగతుల సమస్యను మంత్రివర్గ ఉపసంఘానికి నివేదించారని అది ఏమైందో తెలియరావడమేలేదని శ్రీ గౌతులచ్చన్న అన్నారు.

కమ్యూనిస్టుసభ్యుడు మగ్దుం మొహియుద్దీన్ మాట్లాడుతూ పారిశ్రామికీకరణకు విద్యుదుత్పాదనకు ఉద్దేశించిన పథకాలన్నీ అమల్లోకివస్తే రాష్ట్రము వైభవోన్నతులు పొందగలదని అహార పదార్థాల ధరలు, కిరోసిన్ కొరత మున్నగు తక్షణ సమస్యల విషయమై గవర్నర్ ప్రసంగంలో కప్పదాట్లు కనిపిస్తున్నాయని అన్నారు.

శ్రీ సింగరాజు రామకృష్ణయ్య (టీచర్) మద్రాసు, మైసూరు రాష్ట్రాల స్థాయికి పెరుగుతున్న వెంచాల్సిందిగా ఉద్యోగస్థులు టీచర్లు కావించిన డిమాండ్లు పెడచెవిని పెట్టబడ్డాయన్నారు.

శ్రీ వి.పి. రాఘవాచారి (టీచర్) ఆహార ధాన్యాల పంపిణీపట్ల ప్రభుత్వం లాభదాయ్యాగా ఉన్నట్లు తోస్తున్నదన్నారు. టీచర్లు, ఎన్. జి. ఓ. ల డిమాండ్లపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం విచారకరమన్నారు. విద్యా ఇన్స్పెక్టొరేట్ పునర్నిర్మాణం అవశ్యం లేదన్నారు.

భారత డ్రగ్స్ సంస్థ కర్మాగారాలు

ఏప్రిల్ నుండి నాల్గో తరగతి ఉద్యోగులకు కూడా కేంద్రం పే స్కేళ్లు

డెహ్రాడూన్, జులై 26

కేంద్ర ప్రభుత్వ వేతనాల స్కేళ్ళు ప్రభుత్వ రంగములో పని చేస్తున్న మూడు భారత డ్రగ్స్-ఫార్మస్యూటికల్స్ సంస్థల్లోనూ పనిచేస్తున్న 4 వ తరగతి ఉద్యోగులకు కూడా ఇవ్వబడుతాయి. ఈ సంస్థలు మద్రాసు, హైద్రాబాద్, హృషీకేశ్ లలో ఉన్నాయి.

ఇండియన్ డ్రగ్స్- ఫార్మస్యూటికల్స్ సంస్థ అధ్యక్షుడు శ్రీ ఆర్. ఆర్. బెహల్ నిన్న హృషీకేశ్ వద్ద కర్మాగారంలో విలేఖరులతో ముచ్చటిస్తూ కేంద్రం స్కేళ్ళుగడచిన ఏప్రిల్ 1నుండి అమలుజరుపబోతున్నట్లు వెల్లడించారు. ఇందువల్ల ప్రతినాల్గోతరగతి ఉద్యోగికి నెలకు రు 40 వేతనములో పెరుగుతుంది.

పి. ఎల్ ఒప్పందంకింద పదిలక్షల టన్నుల గోధుమ

న్యూఢిల్లీ, జులై 26

మనదేశానికి అమెరికా మూడు పదిలక్షల టన్నుల గోధుమ విక్రయించేందుకు వీలుగా ఉభయ దేశాలమధ్య కొత్త ఏర్పాటొకటి జరిగింది. ఈ గోధుమ విలువ సుమారు 5 కోట్ల 88 లక్షల డాలర్లు ఉంటుంది. రూపాయిలో ఈ డబ్బు చెల్లించటం జరుగుతుంది. కొత్తగా పి. ఎల్. 480 ఒప్పందం చేసుకోవడంగురించి అమెరికా ఆలోచించేవరకూ. మనదేశానికి గోధుమల దిగుమతి నిరాటంకముగా సాగటానికి ఈ ఏర్పాటు చేసుకోవటం జరిగింది. 1964 సెప్టెంబరు 30 న జరిగిన పి. ఎల్. 480 ఒప్పందంకింద సప్లయ్ చేయబడే సుమారు 40 లక్షల టన్నుల గోధుములు, ఇతర వస్తువులకుతోడుగా ఈ గోధుమ సరఫరా చేయబడుతుంది.

గోధుమ అమ్మకంవలన వచ్చేడబ్బులో నూటికి 75 వంతులు అమెరికా మనకు అప్పుగా యిస్తుంది. దేశంలో ఆర్థిక, సాంఘికాభివృద్ధికి తోడ్పడే ప్రాజెక్టులలో, రెండుదేశాలు ఆమోదించినవాటికే ఈ డబ్బు వినియోగిస్తారు.

ఆర్థిక మంత్రిత్వశాఖలో ఆర్థికవ్యవహారాల విభాగపు అదనపు కార్యదర్శి శ్రీ పి. గోవిందన్ నాయర్, అమెరికా రాయబారి కార్యాలయపు దౌత్య వ్యవహారి శ్రీ జోసెఫ్, ఎస్. గ్రీన్ ఈరోజున న్యూఢిల్లీలో ఈఏర్పాటుకి సంబంధించి పత్రాలు పరస్పరం అందజేసుకున్నారు

....

ఐదంతస్తులభవనంకూలి ఆర్గురి మృతి

బొంబాయి, జులై 26

నేటి ఉదయము మధ్య బొంబాయి ప్రాంతములో ఇటీవలి వర్షాలకుగాని ఒక భవనం కూలిపోగా ఆర్గురు చనిపోయారు. వారిలో ఇరువురు పిల్లలు, భార్య, భర్తగల మొత్తము కుటుంబం ఒకటి ఉంది. ఈ భవనం ఐదంతస్తులు కలది. వెనుకభాగము కూలిపోవడము ప్రారంభమై ప్రక్కనఉన్న గుడిసెపై పడగా అందు నిద్రిస్తున్న ఈ కుటుంబం చనిపోయింది. మిగిలిన ఇరువురూ బాల్గోఅంతస్థులో తమభాగంలో నిద్రిస్తున్నవారు.

కాంగ్రెస్ నాయకత్వ అధికారాపేక్షపై విమర్శ

బెంగుళూరు, జులై 25

'చిర దరిని చూడండి; శాము చేయదలచింది చేయటకువీలుగా ఎలా గాంధీజీపై పువ్వుపెట్టి కూర్చున్నారో' అని ఎ.ఐ.సి.సి. సమావేశానికి గుజరాత్ నుండి వచ్చిన ప్రతినిధి ఒకరు కోపోద్రేకముతో అరిచారు. సభామంటపం వెనుకభాగాన, గాంధీజీ, నెహ్రూల చిత్రాలు అమర్చబడ్డాయి.

శ్రీ బాబూభాయిజె.పటేలు "నిర్మాణ సామరస్యం" శీర్షికమీద ప్రసంగిస్తూ, ఉన్నత నాయకత్వాన్ని తీవ్రంగా విమర్శించారు ఉన్నత నాయకవర్గపు "అధికారాపేక్ష కాంగ్రెసులో అవినీతి పెరగటానికి మూలం" అన్నారు.

నాల్గో ప్రణాళికలో శాస్త్రీయ పరిశోధనల కేటాయింపులో కోత

60 కోట్లదాకా తగ్గించబడ వచ్చునని సూచన

న్యూఢిల్లీ, జులై 26

నాలుగో ప్రణాళికలో శాస్త్రీయ పరిశోధనలకోసం ఇంతకు పూర్వము కేటాయించిన 160 కోట్ల రూపాయలలో 20 నుండి 30 కోట్ల రూపాయలదాకా తగ్గించవలసిందని సలహా కమిటీ ప్రణాళికా సంఘానికి సిఫార్సు చేసిందని తెలుస్తున్నది.

దేశంలోని వివిధ ప్రయోగశాలల విస్తరణకు, ఇతర అవసరాలను పరిశీలించి ఈకోతకుసిఫార్సుచేసినట్టుఅధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇక మొత్తం కేటాయింపు 220 కోట్ల రూపాయల నుండి ప్రయోగశాలలు ఇతర ప్రతిపాదనల ఖర్చులను పరిశీలించి 190 కోట్ల రూపాయల వరకు కుదించవచ్చునని ఈ వర్గాలు సూచిస్తున్నాయి.

శాస్త్రీయ పరిశోధనకు సంబంధించిన సిఫార్సులను వచ్చే సెప్టెంబర్ లో జరిగే ప్రణాళికా సంఘానికి సలహా కమిటీ తమ సిఫార్సులను సమర్పించనున్నది.

గోవా భవిష్య న్నిర్ణయం

బాధ్యత పార్లమెంటుకు వదలాలని శ్రీ ఉపాధ్యాయ సూచన

ఇండోర్, జులై 26

గోవా సమస్యపై భారతీయ జనసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఒక ప్రకటన చేస్తూ రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం నిర్ధారించిపెట్టిన సూత్రాలను బట్టి గోవా భవిష్యన్నిర్ణయాన్ని పార్లమెంటుకు వదిలిపెట్టాలన్నారు.

గోవా సమస్య తేల్చాలని ఇందుకు ప్లెబిసైట్ మార్గమని ప్రభుత్వం అనుకోడము పొరబాటని శ్రీ ఉపాధ్యాయ విమర్శించారు. ఇతర పార్టీలవారు కూడా ఇలా ప్లెబిసైటే కోరవచ్చునని కాగా ఈప్రతిపాదనను రద్దుపరచడము మంచిదని ఆయన గతరాత్రి ఒక సమావేశములో మాట్లాడుతూ ప్రస్తావించారు.

దేశాన్ని పీడిస్తున్న ఆహార సమస్య కచ్ సరిహద్దు సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్ళించడానికే ఈ గోవా వ్యవహారము ఇప్పుడు ప్రధాన విషయంగా కావించబడిందని ఆయన ఆరోపించారు

భారతటెలిఫోన్ల సంస్థచే రు. 10 కోట్లకు మించి అమ్మకాలు

న్యూఢిల్లీ, జులై 26

బెంగుళూరులోని భారత టెలిఫోనులు, టెలిఫోను పరికరాల తయారీ సంస్థ అమ్మకాలు 1964-65లో 10 కోట్ల రూపాయలను మించింది. 1962-63లో అన్ని రంగాలలోనూ సర్వతో ముఖాభివృద్ధినిసాధించినందుకు ఈ సంస్థకు రాష్ట్రపతి షీల్డు లభించింది. విదేశాలలో కూడ ఈ సంస్థ తయారు చేస్తున్న సరుకులకు గిరాకీ పెరిగింది, సింహళం, నేపాల్, న్యూజిలెండు, భూటాన్, సింగపూర్, కువాయిట్, సోమాలి రిపబ్లిక్, పాకిస్తాన్ వియత్నాం, బెల్జియం దేశాలనుంచి సుమారు 4 లక్షల రూపాయల విలువగల ఆర్డర్లు వచ్చాయి. మలేసియా, సూడాన్, బర్మా, ఇరాక్, భూటానులకు సుమారు 7.47 లక్షల రూపాయల విలువచేసే పరికరాలు ఎగుమతి అయ్యాయి.

ట్రాన్స్ మిటర్ల తయారీలో ఈ సంస్థ అభివృద్ధిని సాధించింది.

1963-64 లో ఈసంస్థ 1,46,182 టెలిఫోన్లను తయారుచేయగా సమీక్షా సంవత్సరంలో 1,55,000 టెలిఫోన్లను ఉత్పత్తిచేసింది. మైక్రోవేవు పరికరాలు రిపీటర్లు మొదలైనవాటినికూడా ఈ సంస్థ తయారుచేస్తున్నది. 1964 అక్టోబరు-డిసెంబరులో కార్మిక వివాదాల వల్ల ఉత్పత్తి కొంత దెబ్బతిన్నది. అయితే కేంద్ర కమ్యూనికేషన్సు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ సత్యనారాయణసిన్హా యిచ్చిన తీర్పుమేరకు, ఆ వివాదం పరిష్కారమైంది.

.....

సెక్షన్ ఆఫీసర్ల గ్రేడు పరీక్షలు

మద్రాసులో కూడా హాజరయ్యే అవకాశం

న్యూఢిల్లీ, జులై 26

1965 డిసెంబరులో జరుగనున్న సెక్షన్ ఆఫీసర్ల గ్రేడు పోటీ పరీక్షలు ఇతర కేంద్రాలతో పాటు మద్రాసులో కూడా నిర్వహించబడతాయని యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ నేడొక పత్రికా ప్రకటనలో వెల్లడిచేసింది. మద్రాసు కేంద్రంలో ఈపరీక్షలకు హాజరు కాగోరే అభ్యర్థులు ఆ విషయం వెంటనే కమీషనుకు తెలియచెయ్యాలి.

20 కోట్లతో హైద్రాబాద్ సింథటిక్ డ్రగ్స్ ఫ్యాక్టరీ

ఈ అక్టోబర్ లోనే ఉత్పత్తి ప్రారంభం

డెహ్రాడూన్, జులై 26

ప్రభుత్వ రంగంలో ఏర్పాటవుతున్న రెండు పెద్ద ఫార్మస్యూటికల్ కర్మాగారాలు, ఒక సర్జికల్ పరికరాల కర్మాగారమూ ఈ యేడాదిలోనే ఉత్పత్తి ప్రారంభించనున్నాయి.

ఫార్మస్యూటికల్ కర్మాగారాలు రెండూ ఆసియాలోకెల్ల పెద్దవి. ఈ మూడు కర్మాగారాలూ హృషీకేశ్, హైద్రాబాద్, మద్రాసుల్లో ఏర్పాటవుతున్న విషయం పాఠకులెరిగినదే.

హృషీకేశ్ లోని,యాంటిబయాటిక్ ఫ్యాక్టరీలో నేడు జరిగిన విలేఖరుల గోష్ఠియందుపాల్గొంటూ భారతడ్రగ్స్ సంస్థ అధ్యక్షుడు శ్రీ ఆర్. ఆర్. బహల్ ఈ మూడు ప్రాజెక్టులకుగాను 48 కోట్ల రూపాయలు పెట్టుబడి వుంటున్నదన్నారు. ఈ పెట్టుబడి అంచనాలో కాలనీల నిర్మాణ వ్యయము కూడా చేర్చబడింది. ఈ మూడుకర్మాగారాలూ నిపుణుల సాయంతోరయారవుతున్నాయి.

హృషీకేశ్ లోని యాంటిబయాటిక్సు ఫ్యాక్టరీ, హైద్రాబాద్ లోని సింథటిక్ మందుల కర్మాగారము ఈ సంవత్సరం అక్టోబరులో ఉత్పత్తి ప్రారంభిస్తాయి. మద్రాసులోని సర్జికల్ పరికరాల కర్మాగారం ఏచ్చే జులై 31 న ఉత్పత్తి ప్రారంభిస్తుందని శ్రీ బెహర్ తెలిపారు.

హైద్రాబాద్ లోని సింథటిక్ మందుల కర్మాగారానికై 20 కోట్లు వ్యయమౌతుంది. ఇక్కడ సల్ఫా మందులు, విటమినులు తయారవుతాయి. వీటా వీటి విలువ 12 కోట్లు ఉంటుంది.

నేడే ప్రధాని శ్రీశాస్త్రి యుగోస్లావియా ప్రయాణం

న్యూఢిల్లీ, జులై 26

భారతప్రధాని శ్రీలాల్ బహదూర్ శాస్త్రి రేపు బొంబాయిమీదుగా బెల్గ్రేడ్ కు వెళ్ళుతున్నారు. యుగోస్లావియాలో నాలుగురోజులు అధికార పర్యటనను జరుపుతారు. యుగోస్లావియాకు శ్రీశాస్త్రి వెళ్ళుతుండటం ఇది మొదటిసారి. ప్రెసిడెంట్ టిటోను మాత్రం వీరు ఇదివరకే ఒకసారి కెయిరోలో కలిశారు.

"ఏదైనా ఉంటే, అసెంబ్లీ సమావేశాల తర్వాతనే"

మంత్రివర్గ విస్తరణను గురించి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రస్తావన

హైదరాబాదు, జులై 26

మంత్రివర్గ విస్తరణమంటూ ఏదయినా జరగ వలసివుంటే అది అసెంబ్లీ సమావేశాలఅనంతరమే నని ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి అన్నారు.

ఎ.ఐ.సి.సి. సమావేశాలకు హాజరయిన ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నిన్న సాయంత్రం నగరానికితిరిగి వచ్చారు.

బెంగుళూరులో కాంగ్రెసు పెద్దలతో కాసు ఆంధ్రప్రదేశ్ మంత్రివిస్తరణనుగురించిఏమీమాట్లాడనేలేదని అక్కడ అందరమూ ఇతర విషయాలలో మునిగి ఉన్నామని శ్రీ బ్రహ్మానంద రెడ్డి విలేఖరులతో అన్నారు.

నేటి ఉదయం ప్రారంభమయిన రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశము ఆగస్టునెల మధ్యప్రాంతంవరకూ కొనసాగగలదని తెలుస్తున్నది.

శ్రీ బ్రహ్మానందరెడ్డి నిన్న నగరానికి రాగానే చికిత్స పొందుతున్న ప్రతిపక్ష నాయకుడు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యను చూసి పరామర్శించి వచ్చారు.

రాష్ట్రగవర్నర్ శ్రీ పట్టంతానుపిళ్ళె శాసనసభ శాసనమండలి సంయుక్త సమావేశాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం.

మూడు లక్షల సంతకాలతో శాసనసభకు వినతిపత్రం

29 వ తేదీన సమర్పించటానికి రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల యాత్ర

(మా విలేఖరి)

హైద్రాబాద్, జులై 26

మున్నయివేలమంది ప్రభుత్వోద్యోగులు ఊరేగింపుగా వెళ్ళి 29వ తేదీ సాయంకాలం నాలుగు గంటలకు మూడులక్షల మంది ఉద్యోగులు సంతకాలుచేసిన సమిష్టి వినతిపత్రాన్ని శాసనసభకు సమర్పిస్తారు. నగరంలోని ఉద్యోగులతోబాటు రాష్ట్రం నలుమూలలనుండి వచ్చిన వారు కూడా ఈ యాత్రలో పాల్గొంటారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంయుక్త కార్యాచరణ సంఘ ప్రతినిధి శ్రీ వి. శ్రీరాములు నేడు పత్రికా ప్రతినిధులకు ఈవిషయాన్ని వెల్లడించారు.

ఊరేగింపు శాసనసభ వద్దకు అరమైలుదూరంలో ఆగిపోవాలని పోలీసు అధికారులు అంత విధించారని, పబ్లిక్ గార్డెన్స్ వరకయినా రానివ్వటానికి అనుమతిని సంపాదించటం కొరకు కృషి చేస్తున్నామని ఈప్రతినిధి వివరించారు.

నేడు గవర్నరు అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో, ప్రభుత్వోద్యోగులకు తాత్కాలిక సహాయం ఇచ్చే విషయం ప్రస్తావించిన రీతి తమకుభాలానిస్పృహను కలిగించిందని వీరన్నారు. ప్రభుత్వోద్యోగులు మానసికంగా ప్రత్యక్ష చర్యకు పూనుకొనుటకు సిద్ధంగా ఉన్నా, తాము సామరస్యపూర్వక పరిష్కారానికే ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

29వ తేదీరాత్రి, రాష్ట్రమంతటి నుండి వచ్చిన ప్రతినిధులతో సదస్సు జరుగుతుందని, పూర్వాపరాలు సమీక్షించి, భవిష్యత్ కార్యక్రమం నిర్ణయించబడుతుందని సంయుక్త కార్యాచరణ ప్రతినిధి వెల్లడించారు.

ప్రకటన

1956 సంవత్సరం భారత కంపెనీల చట్టం 25 సెక్షన్ అనుగుణముగా ఇందుమూలమున తెలియజేయునదేమనగా ఈ దిగువ నుదాహరించిన అసోసియేషన్ కిరస్తాన్‌పల్లి ఖాదీ అండ్ విలేజి ఇండస్ట్రీస్ అసోసియేషన్ కిరస్తాన్‌పల్లి, జిల్లా మహబూబ్‌నగర్ పేరు చివర లిమిటెడ్ లేక ప్రయివేట్ లిమిటెడ్ అని లేకుండా పరిమిత బాధ్యతలతో రిజిస్ట్రేషన్ మరియు లైసెన్సు కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమునకు దరఖాస్తు పెట్టుకొనబడినది. కంపెనీ ప్రధాన లక్ష్యములు క్రింద ఇవ్వబడినవి.

1. సోషలిస్టు తరహా సమాజాన్ని ఖాదీ గ్రామీణ పరిశ్రమల ప్రచారము మరియు సర్వోదయ సిద్ధాంతముల ప్రచారముద్వారా ఆ ప్రాంతములో సాధించుట.

2. పైన చెప్పబడిన అసోసియేషన్ యొక్క ముసాయిదా మెమొరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ పైన ఇవ్వబడిన చిరునామావద్ద చూడవచ్చును.

3. పై దరఖాస్తుపట్ల ఆక్షేపణలు గల వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు లేక కార్పొరేషన్లు తమ ఆక్షేపణలు యీ ప్రకటన ప్రచురించబడిన తేదీనుండి 30 రోజులలోగా డిప్యూటీ సెక్రెటరీ గవర్నమెంట్ ఇండస్ట్రీస్ డిపార్టుమెంట్ ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ వారికి తెలియజేయవలెను.

చీఫ్ ప్రమోటర్
బి. బాలకిష్టారెడ్డి
తేది: 27-7-65

సెంట్రల్ రైల్వే నోటీస్

ఈ రైల్వే వాడి - సికింద్రాబాద్ డివిజన్‌లో తాండూర్-నవంద్గి స్టేషన్ల మధ్య మంతట్టి పేరుగల క్రాసింగ్ స్టేషన్‌లో టిక్కెట్లు ఇచ్చుట వసూలు చేయు పనిని 27-7-65 నుండి ప్రస్తుతంగల కంట్రాక్టరుచే టిక్కెట్లు ఇవ్వబడుచున్న పద్ధతిని రద్దుపరచి యీ క్రాసింగ్ స్టేషన్‌లోగల రైల్వేస్టాఫ్‌కు అప్పగించబడినది.

అకౌంటెంట్ జనరల్ అఫీసు, ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్

అప్పర్ డివిజన్, లోవర్ డివిజన్ క్లర్కులు మరియు స్టెనోగ్రాఫర్ల రిక్రూట్‌మెంటుకు సంబంధించిన ప్రకటన 19-7-65 తేదీన వివరము డిఎ-29(84)/65 క్రింద యీ పత్రికలో ప్రచురించబడినది. అభ్యర్థుల నిర్ణీత వయఃపరిమితులు 17-10-65 కాక 19-10-65 గా వున్నది ఇతర వివరములు మామూలే.

DA-29(96)/65

సెప్టెంబరు 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాలు

కేంద్రవిద్యామంత్రి శ్రీ ఛాగ్లా లేఖ

న్యూఢిల్లీ, జులై 26

1965 సెప్టెంబరు 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాలను సముచితోత్సాహంతో నిర్వహించవలసిందిగా కోరుతూ కేంద్రవిద్యామంత్రి శ్రీ యమ్. సి. ఛాగ్లా రాష్ట్రముఖ్యమంత్రులకు ఒక లేఖవ్రాశారు. గ్రామప్రాంతాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడానికి, ఉపాధ్యాయ సంక్షేమజాతీయ నిధికి విరాళాలు వసూలు చెయ్యడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చెయ్యవలసిందిగా కూడా ఈ లేఖలో కేంద్ర మంత్రి కోరడం జరిగింది. ఈ ఏడాది కార్యక్రమాలలో విరాళాల సేకరణ నిమిత్తం చిహ్నాలు, కార్లకు పెట్టుకొనే చిన్న జండాల అమ్మకం, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, చలన చిత్ర ప్రదర్శనలు, ఉపాధ్యాయుని జీవితం ఇతి వృత్తంగా గల ప్రత్యేకచలన చిత్రాల ప్రదర్శనము చర్చలు, గోష్ఠి సమావేశాలు ఆటల పోటీలు మొదలయినవన్నీ ఉంటాయి.

ఉపాధ్యాయ సంక్షేమ నిధికి ప్రజలు స్వచ్ఛందంగా ఇచ్చే విరాళాలలో నూరింట 80 వంతులు ఏ రాష్ట్రంలో వసూలయింది ఆ రాష్ట్రంలోనే ఇబ్బందులలో ఉన్న ఉపాధ్యాయులకు ఆర్థిక సహాయం అందచెయ్యడానికి వినియోగించబడుతుంది. మిగతాది కేంద్రనిధికి జమకడతారు. ఈనిధి ఏర్పాటు రూ 5 కోట్లు విరాళాలుగా వసూలు చేయ్యాలని ఆశిస్తున్నారు. ఒకవంక సాంస్కృతిక సంఘాలకూ మరొకవంక కళాశాలలకూ, ఉన్నత పాఠశాలలకూ చెందిన నాటకసంఘాలనూ ఉపాధ్యాయ దినోత్సవంనాడుగానీ అంతకు ఒకటి రెండు రోజులు ముందుగాగానీ సాంస్కృతిక, వినోదకార్యక్రమాలూ ప్రదర్శనలూ ఏర్పాటు చెయ్యవలసిందిగా కోరాలనీ, టిక్కెట్ల అమ్మకము మూలముగా వచ్చే సొమ్ము ఉపాధ్యాయ సంక్షేమ నిధికి జమకట్టాలనికూడా కేంద్రమంత్రి లేఖలో సూచించారు.

చాంద్ర విశ్వావసు సం॥ ఆషాఢకృష్ణ చతుర్దశి రా 9-6 ఆర్ద్ర ఉ 6-51 ఉపరి పునర్వసు రా 3-56 సా వ 5-24 మొ; 6-48 మాసశివరాత్రి
[శాలివాహన శకము: 5-5-1887]
27-7-1965 మంగళవారము

గోలకొండపత్రిక

ఫోన్ నెం. 35280

27 జులై 1965 మంగళవారం

కమ్యూనిస్టు చైనా-బర్మా

కమ్యూనిస్టుచైనా అధ్యక్షుడు లీ షావ్ చీ, ప్రధాన మంత్రి చౌఎన్‌లైల ఆహ్వానాన్ని పురస్కరించుకుని బర్మా విప్లవసమితి అధ్యక్షుడు జనరల్ నెవిన్ సతీసమేతముగా యెనిమిది రోజుల పర్యటన నిమిత్తము పెకింగ్ చేరుకున్నాడు. కమ్యూనిస్టు చైనా పాలకులు ప్రచారపు ఉద్దేశ్యాలతో. ఆహ్వానాలు పంపడము. వాటిని అంగీకరించిన వారికి ఒక పధకము ప్రకారము కృత్రిమమైన "ఘనస్వాగతము" పెకింగ్‌లో లభించడము క్రొత్త సంగతి కాదు. బర్మా విప్లవ సమితి అధ్యక్షుడు జనరల్ నెవిన్‌కు అతనివెంట వెళ్ళిన వారికి గూడ చైనా పాలకులు పెకింగ్‌లో యిటువంటి స్వాగత సన్మానాలనే యేర్పాటుచేసి ఉండవచ్చును; యిందులో ఆశ్చర్యము లేదు. అయితే కేవలము ఆహ్వానాలు, స్వాగత సన్మానాల ద్వారానే కాకుండా యిటీవల మరికొన్ని విధాలా గూడ చిన్న చిన్న దేశాలవారిని గోతిలోనికి దించడానికి కమ్యూనిస్టుచైనా కుట్రలు పన్నుచున్నది. ఆర్థిక, సాంకేతిక సహాయము, పరిశ్రమాగారాల నిర్మాణము మొదలయిన సామదాన ఉపాయాలను ప్రయోగించి యిరుగు పొరుగు రాజ్యాలను, క్రొత్తగా స్వాతంత్ర్యము పొందిన దేశాలను తనవలలో వేసుకోవడానికి కమ్యూనిస్టుచైనా గట్టిగా ప్రయత్నించుచున్నది.

రెండు రోజుల క్రిందట పెకింగ్‌కు వెళ్ళిన బర్మా విప్లవ సమితి అధ్యక్షుని బృందములో విదేశాంగ వ్యవహారాల శాఖకు సంబంధించిన ప్రతినిధులు వొక్కరుగూడ లేరు. ఒక విదేశానికి వెళ్లుచున్నప్పుడు విదేశాంగ వ్యవహారాల శాఖకు సంబంధించిన ప్రతినిధి ఉండడము సాధారణమైన విషయము. విదేశ వ్యవహారాల శాఖ ప్రతినిధులకు బదులుగా పరిశ్రమల శాఖా మంత్రి, విద్య, ఆరోగ్య శాఖల మంత్రి బర్మా అధ్యక్షుడు జనరల్ నెవిన్ వెంట పెకింగ్‌కు వెళ్ళినారు. అంటే ప్రత్యేకించి ఆర్థిక, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన విషయాలను గూర్చి సంప్రదించడానికే బర్మా విప్లవ సమితి అధ్యక్షుడు జనరల్ నెవిన్ యెనిమిది రోజుల అమూల్యమైన కాలాన్ని పెకింగ్ పాలకుల మధ్య వెచ్చించ దలచినాడన్న మాట. బర్మా అధ్యక్షునికి అతని సహచరులకు పెకింగ్ పాలకులు అనేకమైన వాగ్దానాలుచేసి అపరిమితమైన ఆశలు కల్పించినా రనుటలో యెంత మాత్రము సందేహము లేదు. ఆర్థిక సాంకేతిక సహాయము మీద యెన్నో ఆశలతోనే బర్మా అధ్యక్షుడు జనరల్ నెవిన్ పెకింగ్‌కు బయలుదేరినాడు.

అయితే కమ్యూనిస్టుచైనా పాలకుల బూటకపు వాగ్దానాలనుగురించి, శుష్క ప్రియాలను గూర్చి, నేతిబీర కాయ రీతి ఆర్థిక సాంకేతిక సహాయాన్ని గూర్చి బర్మా అధ్యక్షునికి, అతని సహచరులకు ప్రత్యేకముగా చెప్పవలసిన పనిలేదు. 1961 వ సంవత్సరములో బర్మా-కమ్యూనిస్టు చైనాల మధ్య ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని గూర్చి కుదిరిన ఒప్పందము యిప్పటివరకు సక్రమముగా అమలు జరుగలేదు; బర్మా విప్లవసమితి ఆశించిన విధముగా యీ ఒప్పందము కార్యరూపాన్ని ధరించడము లేదు. బర్మాలో చైనా కమ్యూనిస్టులు నిర్మించిన ఒక బట్టల మిల్లు విడిభాగాలు పెకింగ్ నుండి సరిగా సప్లయికానందున పనికిరాకుండా మూలపడి పోయినది. ఇంత అనుభవము ఉన్నప్పటికిని బర్మా అధ్యక్షునికి యింకను పెకింగ్ మీద ఆశలు ఉడిగిపోలేదు. కమ్యూనిస్టుచైనా ఆర్థిక సాంకేతిక సహాయము కేవలము కాగితాలమీదనే కనుపించుతుందని, ఒకవేళ యేకొద్ది సహాయము చేసినా అది పెకింగ్ పాలకుల ప్రచార కార్యక్రమానికి ఉద్దేశించబడ గలదని ఆఫ్రికాలోని చాలా దేశాలు సత్వరముగానే గుర్తించినవి. ఆర్థిక, సాంకేతిక సహాయము పేరుతో తమ అంతరంగిక విషయాలలో పెకింగ్ జోక్యము చేసుకొనడము సమంజసము కాదని ఆఫ్రికాలోని దేశాలు గట్టిగా హెచ్చరించినవి. బర్మావంటి దేశాలు గూడ అనతికాలములోనే కమ్యూనిస్టుచైనా పాలకుల ఆర్థిక సాంకేతిక సహాయములోని అసలు స్వరూపాన్ని గుర్తించవలసి రాగలదని చెప్పవచ్చును.

హౌరాలో "ఓషధీవన" భవనాల శంకుస్థాపన

కలకత్తా, జులై 26

హౌరాలోని బొటానికల్ గార్డెన్స్‌లో, కేంద్ర జాతీయ ఓషధీవన భవనాలకు కేంద్ర విద్యా మంత్రి శ్రీ ఛాగ్లా నిన్న శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణానికి సుమారు 40లక్షలరూపాయలు ఖర్చవుతుంది. ఇప్పటికి సేకరించబడిన ఇరవై లక్షల జాతుల వృక్ష సంతతితో పాటు, రానున్న 60-70 సంవత్సరాల కాలంలో సేకరించిన వృక్ష సంతతిని కూడాదీనిలోఉంచుటకు వీలవుతుంది.

ఈ "ఓషధీవనం" 1884లో ప్రారంభించబడింది. 1957లో కేంద్రప్రభుత్వ అధీనంలోనికి వచ్చింది.

వినియోగదారుల సమస్యపై అఖిలభారత గోష్ఠి

హైదరాబాదు, జులై 26

భారత్ సేవక్ సమాజము ఆహార పదార్థముల వినియోగదారుల సమస్యల విషయమై ఒకగోష్ఠిని ఆగస్టు 7వ తేదీ నుండి 9 రోజుల పాటు జరుపనున్నదని ఆ సందర్భంలో అఖిలభారత స్థాయిలో ఈ సమస్యల విషయమై 5 రోజులపాటు ఒక ప్రదర్శన గూడా జరుపబడునని తెలుస్తున్నది.

ఈ గోష్ఠి ప్రారంభోత్సవం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డిచే ఎగ్జిబిషన్ ఆవరణయందు జరుపబడును. అఖిలభారత ఆహారసంస్థ చైర్మన్ శ్రీ టి.ఎ.పాయ్ దీనికి అధ్యక్షత వహిస్తారు.

ఈ గోష్ఠిలో వినియోగదారుల సమస్యలు, ఆహార పదార్థములలో కల్తీ చేయుట, తప్పుడు తూనికలు, వినియోగదారుల భద్రత, సహకారము మొదలగు విషయములు చర్చింపబడుతాయి.

హైదరాబాదుమున్సిపల్ కమిషనర్ ఆరోగ్య శాఖాధికారులు, ఇతర అధికారులు, ప్రముఖ అనధికారులు ఈ గోష్ఠిలో పాల్గొంటారు.

ఈ గోష్ఠి సందర్భములో ఏర్పాటు చేయబడే ప్రదర్శనలో, కల్తీచేయబడిన ఆహారపదార్థముల మచ్చులు, స్వచ్ఛమైన ఆహారపదార్థములమచ్చులు ప్రదర్శింపబడతాయి.

వినియోగదారుల సమస్యల విషయమై ఈగోష్ఠి చాలా ఉపయోగకరమైన అంశములను ప్రజలకు తెలియపరచుననిని భారత్ సేవక్ సమాజ్ చైర్మన్ శ్రీ నరసింగరావు పత్రికా విలేఖరులకు తెల్లడిచేశారు.

గోవా సమస్య:

ఎన్నికలకు మౌలిక ప్రాతికూల్యం లేదు

అన్ని పక్షాలకూ ఆమోదయోగ్యంగానే పరిష్కారం సాధ్యమని ప్రధాని ఆశాభావం

న్యూఢిల్లీ, జులై 26

గోవా సమస్యపై అన్ని పక్షాల వారికీ ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కారం సాధ్యపడుతుందనే తానాశిస్తున్నానని ఈ ఉదయం బెంగుళూరు నుండి ఢిల్లీ చేరిన ప్రధాని శ్రీ లాల్ బహద్దూర్ శాస్త్రి వెల్లడించారు.

పరిష్కారం సాధ్యమే. గోవా ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోడానికి ఎన్నికలు జరుపాలన్న ప్రతిపాదనకు మౌలికమైన ప్రాతికూల్యం ఏమీలేదు- అని ప్రధాని అన్నారు. వివరాలు తర్వాత ఆలోచించబడుతాయనిఆయన ప్రస్తావించారు.

బెల్గాం వ్యవహారంలో మహారాష్ట్ర, మైసూర్ల మధ్యగల సరిహద్దు వివాదాన్ని పరస్పరం సమాలోచనలతో పరిష్కరించుకోవాల్సిందిగా సలహాఇస్తూ ఉభయ ముఖ్యమంత్రుల్నీ ఢిల్లీకి పిలిస్తున్నట్లు వెల్వడినవార్తపై విలేఖరులు ప్రశ్నించగా ప్రధాని శ్రీ శాస్త్రి అదేమీ లేదన్నారు.

బెంగుళూరు ఎ.ఐ.సి.సి సమావేశాలలోకావించబడిన తీర్మానాన్నిగురించి ప్రస్తావిస్తూ శ్రీ శాస్త్రి ప్రభుత్వస్థాయిలోను, వ్యవస్థా స్థాయిలోను విభేదాల్ని పరిష్కరిస్తూ సమైక్యత కాపాడడానికి యంత్రాంగాన్ని సూచిస్తూ తొలిసారిగా బెంగుళూరు సెషన్‌లో కావించబడిన తీర్మానాలు రెండూ చాలా ప్రధానమైనవనీ ఆ తీర్మానాల వెనుకగల వాతావరణాన్ని అవశ్యకతను ప్రజలు, ఆయా కార్యకర్తలూ గుర్తిస్తారని ఆశిస్తున్నాననీ శ్రీ శాస్త్రి అన్నారు. సంస్థలో విభేదాల పరిష్కారానికి కూడా ఒక యంత్రాంగము ఈసారి ఏర్పాటైంది. ఇంతకు మునుపు ఈయంత్రాంగంలేదు. ఇప్పుడుద్దేశించబడుతున్న యంత్రాంగం అన్ని వివాదాల్నీ పరిశీలించి తుది పరిష్కారము కావిస్తుందని ప్రధాని అన్నారు. దేశం ఈనాడెదుర్కొంటున్న క్లిష్టపరిస్థితుల మధ్య కాంగ్రెసు సంస్థ పటిష్టంగా ఉండడం అవసరమన్నారు.

కార్మిక వ్యవహారాల ప్రాంతీయ సంస్థకు ప్రారంభోత్సవం

కేంద్రమంత్రి శ్రీదామోదరం సంజీవయ్య ప్రసంగం

మద్రాసు, జులై 26

ఇక్కడ కార్మిక వ్యవహారాల ప్రాంతీయ సంస్థకు ప్రారంభోత్సవం జరుపుతూ కేంద్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య ఈ సంస్థలో కేంద్ర కార్మిక సంస్థకు చెందిన నిపుణులైన ఉద్యోగుల సహాయంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని, ఈ ప్రాంతానికి సంబంధించిన సమస్యల పరిష్కారం విషయమై సమగ్ర పరిశీలన జరుగుతుందని, దేశంలో వివిధ పారిశ్రామిక ప్రాంతాల అవసరాలు తీర్చడానికిగాను ఇటువంటి మరో నాల్గు ప్రాంతీయ సంస్థలు ఏర్పాటు అవుతాయనీ అన్నారు. ఈ సంస్థలకు చెందిన భద్రత, ఆరోగ్యం, సంక్షేమ కేంద్రాలలో వివిధ విభాగాలలో సాధన సామగ్రులు సమకూర్చడంలో అయితేనేమి ఈ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికా రచనలో అయితేనేమి పరిశ్రమల యజమానులు ఎంతగానో సహాయం చేశారని, ఈ కేంద్రాలలోని యంత్రాలు, ప్రదర్శనకు పెట్టిన అనేక ఇతర వస్తువులు వారి వద్ద నుంచి అద్దెకు లభించాయనీ కూడా కేంద్ర మంత్రి తెలియజేశారు. ఇటువంటి సహాయ సహకారాలు అందచేసినందుకు కృతజ్ఞత తెలియచేస్తూ ఈ సంస్థలు తమ విధ్యుక్త ధర్మాలను అందరికీ సంతృప్తికరంగా నిర్వర్తించడానికి వీలుగా ముందుముందు కూడా పరిశ్రమల యజమానుల వద్ద నుంచి ఇదే విధమైన సహాయం లభించగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్ర మంత్రి శ్రీ సంజీవయ్య తమ ప్రసంగంలో క్లిష్టమైన కార్మిక, పారిశ్రామిక సమస్యలను జాగ్రత్తగా పరిష్కరించవలసి ఉన్నదనీ, వీటి విషయం విస్మరించడానికి వీలు పడదనీ. ఇప్పుడు క్రొత్తగా ఏర్పడిన సంస్థల సహకారంతో ఆధునిక శాస్త్రీయ పద్ధతులలో ఆయా సమస్యలను పరిష్కరించడానికి ఇప్పుడు అవకాశం కలిగిందనీ కూడా తెలియ చేశారు.

సౌవన్న ఫౌమా ఢిల్లీ రాక

న్యూఢిల్లీ, జులై 26

లావోస్ ప్రధాని సౌవన్న ఫౌమా నేటి ఉదయం ఢిల్లీకి వచ్చాడు. ఆయన రెండు దినాలు నగరంలో ఉంటాడు.

విమానాశ్రయంలో విదేశాంగ మంత్రి సర్దార్ స్వర్ణసింగ్ ఆయనకు స్వాగతమిచ్చారు.

బ్రిటిష్ లెక్చరర్ గెరాల్డు బ్రూక్‌కు 5 ఏళ్ళ శిక్ష

రష్యాలో గూఢాచారిచర్యలు జరిపిన నేరంపై

మాస్కో, జులై 25

రష్యాలో గూఢాచారి చర్యలు జరిపిన నేరంపై బ్రిటిషు లెక్చరర్ గెరాల్డు బ్రూక్‌కు 5 ఏళ్ళ పాటు స్వేచ్ఛా నిరాకరణ శిక్ష విధించబడింది.

కొన్ని రోజులుగా ఇక్కడ జరుగుతున్న విచారణలో బ్రూక్ తాను నేరం చేసినట్టు అంగీకరించాడు. అతను రష్యా నుండి విదేశాలకు వలస పోయిన వారి తరపున రష్యా విరుద్ధ చర్యలు సాగించాడని, అందువల్ల 7 ఏళ్ళపాటు కఠిన శిక్ష విధించాలని సోవియట్ ప్రాసిక్యూటర్ కోరాడు.

నిన్న బ్రూక్‌కు విధించిన 5 ఏళ్ళ శిక్షలో మొదటి సంవత్సరం జైలులో గడపాలి మిగతా నాలుగు సంవత్సరాలు ఇక్కడి కార్మికుల వాడలో కఠినమైన అంతల క్రింద నివసించాలి.

ఈ తీర్పు వినగానే బ్రూక్ తన దుఃఖాన్ని వ్యక్తం చేస్తూ తన యౌవనంలోని మంచి రోజులను పోగొట్టుకోవలసి వస్తున్నదని అన్నాడు. బ్రూక్‌కు ఇప్పుడు 28 సంవత్సరాలు.

తనను ఇక్కడ దీర్ఘకాలంగా నిర్బంధించిన పక్షంలో 70 ఏళ్ళ వృద్ధురాలైన తన తల్లిని తాను ఇక చూడలేనని, తన తల్లి తన సుఖాలన్నింటిని త్యజించి తన విద్యకోసం పాటుపడిందని బ్రూక్ బాధ పడ్డాడు.

యు. పి. విభేదాలు పరిష్కరించనందుకు శ్రీశాస్త్రి పశ్చాత్తాపం

బెంగుళూరు, జులై 26

తమ రాష్ట్రములోనే ప్రబలిన కాంగ్రెసు నాయకుల విభేదాలను తాను పరిష్కరించలేకపోయానని, శ్రీలాల్ బహద్దూర్ శాస్త్రి అఖిలభారత కాంగ్రెసు కమిటీముందు తమ "తప్పి"దాన్ని ఒప్పుకున్నారు. ఎ. ఐ. సి. సి. సమావేశములో ప్రసంగిస్తున్న సందర్భములో తమమీద నేరమారోపించిన వారికి సమాధానంగా వీరివిషయాన్ని చెప్పారు.

దురదృష్ట వశాత్తు, కాంగ్రెసు వాదులలో పొడచూపిన విభేదాలు, వివాదాలు ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నాయని, ఇందువల్ల సంస్థ నిర్మాణానికి, పరువు ప్రతిష్ఠలకు భంగము గలుగు తున్నదని శ్రీ శాస్త్రి వివరించారు.

"ఇతర రాష్ట్రాల విషయములో ఇది (వివాద పరిష్కారము) సులభమేమోగాని, మారాష్ట్రములో అంత సులువయినదిగా గోచరించటం లేదు" అన్నారు.

దక్షిణభారత హిందీప్రచార సభ, మద్రాసు ప్రధాన కార్యదర్శికి సన్మానం

హైదరాబాద్, జులై 26

దక్షిణభారత హిందీప్రచారసభ, "ఆంధ్ర" కార్యదర్శిగా దక్షతతో పనిచేసి, దక్షిణభారత హిందీప్రచారసభ, మద్రాసు కేంద్రసభకు ప్రధాన కార్యదర్శిగా నియమింపబడిన శ్రీ జి. సుబ్రహ్మణ్యముగారికి ది 19-7-65 సాయంత్రము హైదరాబాదులోని ఆంధ్రసభ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులు, దక్షిణభారత హిందీప్రచార సభ 'ఆంధ్ర' అధ్యక్షులుఅగు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన సన్మానసభ జరుపబడెను.

ఆంధ్రసభ కార్యదర్శి శ్రీ కా రా. సారంగపాణిగారు సభికులకు, ఆహ్వానితులకు స్వాగతంచెబుతూ శ్రీ జి. సుబ్రహ్మణ్యంగారి గుణగణములను ప్రశంసించిరి. శ్రీయుతులు ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య, వేమూరి రాధాకృష్ణమూర్తి, చంద్రభట్ల అప్పన్నశాస్త్రి, అట్లూరి రామారావు అడవి శ్రీ కృష్ణమూర్తి, నరసింగ ప్రసాదు జాయసోల్ గారలు శ్రీ సుబ్రహ్మణ్యంగారి కార్యదక్షతను కొనియాడి వారి అధ్యర్యాన దక్షిణ భారత హిందీప్రచారసభ అభివృద్ధికి రాగలదని ఆశించుచూ ప్రసంగించిరి.

విద్యాకమీషన్‌కు ఉపాధ్యాయసంఘ మెమొరాండం

విద్యావిధానంలో తేదగిన పెక్కు సంస్కరణల సూచన

హైదరాబాద్, జులై 26

అఖిల భారత విద్యాకమీషన్‌కు, స్టేట్ ఉపాధ్యాయసంఘము సమర్పించిన మెమొరాండములో విద్యావిధానంలోనూ బోధనా విషయాలలోనూ సాంకేతిక విద్యలోనూ, విద్యకు సంబంధించినంతవరకు ఆర్థిక, పరిపాలనా విషయాలలోనూ, చేయగలగిన మార్పులను పెక్కింటిని సూచించింది.

స్వాతంత్ర్యము లభించిన 18 సంవత్సరాల తర్వాతకూడా, విద్యావిధాన నిర్ణయములో ఇంకా పరిశోధనాత్మక చర్యలు తీసుకుంటూ ఉండటముచేతనే విద్యావిషయములో మన గమ్యాన్ని చేరలేకపోయామని వివరించారు. విద్యావిధానము, జాతీయ గమ్యానికి వ్యతిరేకంగా ఉండకూడదని సూచించబడింది.

సామాన్య విద్యతోపాటు, సాంకేతిక, వృత్తి విద్యాబోధనకూ వీలు కల్పించాలని, 2సంవత్సరాల సెకెండరీ విద్య, 2 సంవత్సరాల హైయ్యర్ సెకెండరీ విద్య, తరువాత 3 సంవత్సరాల కాలేజీ విద్యను అమలు జరపాలని సూచించబడింది.

త్రిభాషా సూత్రాన్ని ఉపాధ్యాయ సంఘము బలపరచింది. దేశము అంతటికీ ఒకేలిపి ఉండాలని, "దేవనాగరి" లిపి అందుకు తగినదని ఈ మెమొరాండములో సూచించబడింది.

విద్యాశాఖ అధికార్లు ఇంకా వలసవాదుల దృక్పథముతోనే ఉన్నదని, జాతీయ గమ్యము అనే చివరిదృష్టిలో లేదని, మానవత్వపు ఛాయలుకూడా లోపించాయని వివరించబడింది.

విద్యా విధానాన్ని జాతీయము చేసినపుడు మాత్రమే, ఈ సూచనలు అమలు జరుగ వీలుంటుందని, విద్యకు ఉపాధ్యాయుడు జీవగర్ర కనుక, వారికి అపుడే ఉచిత స్థానము లభిస్తుందని, అపుడు మాత్రము దేశవ్యాప్తముగా సాంఘిక విప్లవము వస్తుందని, ఉపాధ్యాయ సంఘంవారు అభిప్రాయపడ్డారు.

ఈ మెమొరాండములో డాక్టరు గౌతమ్‌మాథుర్ వ్రాసిన పరిశోధన వ్యాసం కూడా ఉన్నది.

విద్యుత్ రేట్ల పెంపుదల: గ్రామాల సత్వర విద్యుదీకరణ

దక్షిణాది రాష్ట్రాల ప్రభుత్వ ప్రతినిధుల సూచన

బెంగుళూరు, జులై 26

దక్షిణాది రాష్ట్రాల విద్యుదవసరాలను ఇచ్చట జరిగిన సమావేశంలో పరిశీలించారు, ఈసమావేశానికి మదరాసు, ఆంధ్రప్రదేశ్, మైసూరు రాష్ట్రాల విద్యుచ్ఛక్తి శాఖ మంత్రులు, కేరళ ప్రభుత్వ సలహాదారు శ్రీ ప్రసాద్ హాజరయినారు. కేంద్ర విద్యుచ్ఛక్తి శాఖా ఉపమంత్రి శ్రీ కె. యల్. రావు అధ్యక్షత వహించారు.

దేశంలోవిద్యుదుత్పత్తిని పెంచవలసిన అవసరమున్నదని, అందుకువీలుగా దేశంలోని శక్తియుక్తుల నుపయోగించాలని శ్రీ రావు వివరించారు. దేశమంతటా థర్మల్ విద్యుత్ కేంద్రాలను నిర్మించటానికి ఒక కేంద్ర సంస్థ అవసరమనికూడా వీరుసూచించారు.

రాష్ట్రాలమధ్య విద్యుత్‌సరఫరాకు త్వరలో వీలుకల్పించాలని సమావేశం అభిప్రాయపడింది. మైసూరు-మద్రాసుల మధ్య ఇట్టి సదుపాయం ఈసంవత్సరాంతానికి, మద్రాసు-ఆంధ్రప్రదేశ్‌ల మధ్య 1966జూన్‌లోనూ ఇట్టి సదుపాయాల ఏర్పాటు పూర్తవుతుంది.

వెంకటరామన్ కమిటీ, ప్రపంచ బ్యాంకు సూచించినట్లు తగినంత ఆదాయము రావటానికి వీలుగా విద్యుచ్ఛక్తి రేట్లను మార్చాలని కూడా సమావేశం అభిప్రాయపడింది.

రెండు, లేక మూడు రాష్ట్రాల గుండా ప్రవహించే నదుల జలాలనుపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తిచేసే అవకాశాలను కేంద్రం కూలంకషంగా పరిశీలించి, పథకాలను రూపొందించాలని, వివరమైన పరిశీలన, అవధకాల అనులను రాష్ట్ర ప్రభుత్వాలు స్వీకరించాలని అందరూ అంగీకరించారు.

గ్రామాల విద్యుదీకరణను త్వరితగతిని సాగించాలని, ఈవిషయములో సాధించిన అభివృద్ధిని తెలిపే చిత్రాలను, ఛార్టులను దేశంలో ఏ ప్రాంతములో ప్రదర్శనముజరిగినా, దానిలో ప్రదర్శించాలని అభిప్రాయపడ్డారు.

కాపుసారా పట్టివేత

హైదరాబాదు, జులై 25

చాదర్‌ఘాట్ పోలీసు సబిన్స్పెక్టరు శ్రీ వి బి. రాజు. అపరాధ పరిశోధక శాఖకు చెందిన మరొక సబిన్స్పెక్టరుతో కలిసి 30గాలన్ల కాపుసారాయిని పట్టుకున్నారు. ఈ సారాయి ఒక గోదాములో దాచబడినదని అది గోరాసింగ్ అనేవారిదని చెప్పబడుతున్నది. అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ శ్రీ జనార్దన్ నాయకత్వాన పోలీసు అధికారులు దీనిని పట్టుకున్నారు.

త్రివేండ్రంలో శ్రీ నందాకు అతివాద కమ్యూనిస్టుల నల్లజెండాల ప్రదర్శనం

త్రివేండ్రం, జులై 26

కేరళ వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ సలహా సంఘ ద్వితీయ సమావేశాలకు అధ్యక్షత వహించడానికి నేటి ఉదయం ప్రత్యేక విమానంలో కేంద్ర హోం మంత్రి శ్రీ జి. ఎల్. నందా త్రివేండ్రానికి వచ్చారు.

ఈ సందర్భాన్ని వినియోగించుకొని అతివాద కమ్యూనిస్టులు నల్లజండాల ప్రదర్శనలు చేశారు. దాదాపు 20 మంది అతివాదులు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. "ఫాసిస్టు నందా వెనక్కి వెళ్ళిపో" "అమెరికా ఏజంటు నందా వెళ్ళిపో" "ప్రజాస్వామ్య హంతకుడైన నందా రాజీనామా ఇవ్వాలి", "డిటెన్యూల్ని విడుదల చెయ్యాలి" అని వీరు నినాదాలు కూడా చేశారు.

విమానాశ్రయంనుండి శ్రీ నందా కారులో వెళ్తుండగా కొద్ది దూరంలో దారికాసిన ఈ అతివాద కమ్యూనిస్టు ప్రదర్శకులు ఈ నందా వ్యతిరేక నినాదాలు కావించారు.

త్రివేండ్రం నగర ప్రాంతంలోకి వస్తుండగా అక్కడ 200 మంది అతివాద కమ్యూనిస్టులు గుమిగూడి ఇటువంటి ప్రదర్శనలే చేశారు. ఈ ప్రాంతంలోగల ట్రాఫిక్ ఐలెండ్‌లో కాంగ్రెస్ పతాకంతోపాటు రెండు నల్ల జండాలు కూడా ఎవరో పాతారు.

"వల్లకడవు" అనుచోట స్థానిక కాంగ్రెసువాదులు శ్రీ నందాకు స్వాగతమిచ్చి పుష్పమాలలు వేశారు. ఆయనకుగాను ఇక్కడ కాంగ్రెసు పతాకాలతో రెండు స్వాగత ద్వారాలేర్పాటైనాయి.

విమానాశ్రయంలో శ్రీ నందాకు కేరళ గవర్నర్ శ్రీ ఎ. పి. జైన్, హోంశాఖ రాష్ట్ర వ్యవహారాల మంత్రి శ్రీ జైసుఖలాల్ హాథి, ఎన్. ఇ. ఎస్. రాఘవాచారి, గవర్నర్ సలహాదారు శ్రీ ఆర్. ప్రసాద్, కేరళ సభాపతి అలెగ్జాండర్ పరంబితర, స్థానిక కాంగ్రెసు ముఖ్యులు ఘన స్వాగతమిచ్చారు.

శ్రీ నందాతోపాటు బెంగుళూరు నుండి కేంద్రార్థిక మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం, కేరళ పి. సి. సి. అధ్యక్షుడు కె. సి. అబ్రహాం కూడా అదే విమానంలో వచ్చారు.

శ్రీ నందా గవర్నర్‌తోపాటు రాజభవన్‌కు వెళ్లారు.

అస్సాం రాష్ట్రములో వరదల పరిస్థితి

గౌహతి, జులై 26

అస్సాం రాష్ట్రపు వరదల పరిస్థితిలో ఈరోజువరకు ఎలాంటి అభివృద్ధి సూచనలు కనబడలేదు. గత 24గంటలలో బ్రహ్మపుత్రానది, దాని ఉపనదులలోని నీటిమట్టము పూర్వముకంటె క్రమేపీ ఎక్కువవుతున్నది.

గతరెండురోజులుగా ఎగువఅస్సాం ప్రాంతములోని అన్ని నదులలో వరదలు ఎక్కువౌతున్నాయని, నేఫా సరిహద్దు ప్రాంతములోని నమాసి అను ప్రదేశము ధూమ్‌ధూమానుండి 20 మైళ్ల వరకుగల మేర జలమయముగా ఉంది.

ధూమ్‌ధూమానుండి అందిన వార్తలనుబట్టి నమాసి అను ప్రదేశమునకు, దేశములోని ఇతర ప్రాంతాములకు 6రోజులుగా రాకపోకలులేవని, నమాసీ ప్రభుత్వ కార్యాలయములలో పని అంతా స్తంభించి పోయిందని తెలియవచ్చింది. ఆప్రదేశములో ఒకచోట నుండి మరియొక చోటికి పోవుటకు చిన్నచిన్న పడవలు తప్ప మరి ఏ విధమైన సదుపాయములులేవని కొద్దిమంది ఉద్యోగస్థులు ఈపడవలలోనే వారి వారి కార్యాలయములకు వెళ్తున్నారని తెలియవచ్చింది. నమాసీకి ధూమ్ ధూమాకు మధ్య రోడ్డు మూడడుగుల నీటిలో మునిగి ఉన్నదని, ధూమ్ ధూమానుండి నమాసీ సబ్ పోస్టాఫీసుకు తపాల వారమునకొక దఫా ఈ పడవలలో తీసికొని పోబడుతున్నదని వార్తలందాయి.

శ్రీ యల్. ఆర్. శర్మకు జనరల్ మేనేజరు పదవి

హైదరాబాద్, జులై 26

సింగరేణి కాలరీస్ కంపెనీ జనరల్ మేనేజరుగా శ్రీ యల్. ఆర్. శర్మ జులై 14వ తేదీన నియమించబడ్డారు. శ్రీ శర్మ 1954వ సంవత్సరము జులై 19వ తేదీన కంపెనీ ఏజంటుగా నియమితులైనారు. 1962 నవంబరులో వీరు ఎడిషనల్ జనరల్ మేనేజరుగా ప్రమోషన్ పొందారు.

మీ కుటుంబానికి రక్షణను పారవేసేయకండి

మీ జీవిత భీమా పట్టాకు కాలదోషం పట్టనివ్వనిస్తే ఏమవుతుందో మీకు తెలుసా? అనిశ్చయమైన భవిష్యత్తులో మీ కుటుంబానికి రక్షణ లేకుండా చేస్తున్నారన్నమాట. దురదృష్టవశాత్తు మీకేమైనా సంభవిస్తే మీ కుటుంబానికి ఎంత రావలెనని మీరు అనుకొని పట్టా పుచ్చుకున్నారో అంత మొత్తం పూర్తిగా రాదు.

కనీసం రెండు సంవత్సరాలైనా పాలసీ అమలులో వుండివుండకపోతే, కాలదోషం పట్టిన జీవిత భీమా పట్టా చిత్తు కాగితం కిందనే లెఖ్ఖ. రెండేళ్లు అమలులోవున్న పట్టామీద కూడా మీకు లాభించేది అతి తక్కువ. ఏవిధంగా చూసినా మీ జీవితాన్ని భీమా చేయడంవల్ల మీ కుటుంబానికి కలిగించిన రక్షణ ప్రయోజనరహితమై పోతుంది.

అందుచేత, మీ జీవిత భీమా పట్టాకు మీరు కాలదోషం పట్టించివుంటే, నేడే దానిని పునరుజ్జీవింప జేయండి.

జీవిత భీమా కార్పొరేషన్ స్పెషల్ రివైవల్ స్కీము కొన్ని షరతులతో కాలదోషం పట్టిన ప్రీమియమ్‌లు అన్నీ మీరు కట్టనవసరం లేకుండానే పట్టాను పునరుజ్జీవింపజేసేందుకు అవకాశం కలిగిస్తుంది. మీ జీవిత భీమా ఏజెంటు సలహా తీసుకోండి. మీ పాలసీని పునరుజ్జీవింపజేసి, మీ కుటుంబానికి అత్యవసరంగా వుండి తీరవలసిన రక్షణను కల్పించడానికి ఆతడు మీకు సహాయం చేయగలడు.

యోగక్షేమం వహామ్యహమ్

జీవిత భీమాకు ప్రతిగా మరొకటి లేదు

ASP LIC/Z-29 TEL



హైదరాబాద్-ఎ

బుధవారం జులై 28

405.4 మీ (740 కిలోసై)

ఉ: 6-30 సుప్రభాతము, 6-40 అం-వా, 6-45 భక్తిరంజని, 6-55 సూక్తి ముక్తావళి, 7-00 తె-వా, 7-15 సంకీర్తనం, 7-30 సి. హెచ్. పీతాంబరాచారి, 7-45 గులాంజాఫర్ ఖాన్: సారంగి, 8-00 అం-వా, 8-15 లలిత సంగీతం: బృందగానము, 8-30 ఎ.ఎమ్. మాణిక్యవర్మ వీణ.

మ: 11-45 ఉన్నత పాఠశాలలకు (ఉర్దూ).

12-30 కార్మికుల కార్యక్రమం, 1-00 మహిళాసమాజం, 1-30 వద్దావతి గోఖ్లే, 1-40 హిం-వా, 1-50 తె-వా, 2-00 కన్నడ శ్రోతలకు 2-10 ఉ-వా, 2-20 గులాంజాఫర్ ఖాన్: సారంగి,

సా: 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 ప్రస్తుతాంశము, 6-20 హైదరాబాదు బి వశె, 7-00 తె-వా, 7-15 హైదరాబాద్ బి వశె, 7-30 చిత్రకదంబము, 8-00 నాటిక, 8-30 తెలుగుకావ్యం మే వక్తృత్వవర్ణన్: పోతనకృత భాగవత్ మే ఉదాహరణాత్మక ప్రసంగము (హిందీ)లో. అర్జునరావు, 8-45 ఈ మాసపుపాట, 8-50 విరామ సంగీతం, 8-55 టాఫిక్ ఫర్ టుడే, 9-00 అం-వా, 9-15 ఉ-వా, 9-30 ఆంగ్ల ప్రసంగం, 9-45 గులాంజాఫర్ ఖాన్: సారంగి, 10-00 నవరస్, 10-30 అం-వా, 10-35 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి. జనగణమన.

హైదరాబాదు-బి

మ: 11-45 వాద్య సంగీతము 12-30 హైదరాబాదు ఎ వశె, 1-30 సి. హెచ్. పీతాంబరాచారి, 1-40 హైదరాబాద్ ఎ వశె, 2-01 సి. హెచ్. పీతాంబరాచారి.

60.12 మీ (4990 కిలోసై)

సా: 6-00 హైదరాబాదు ఎ వశె, 6-20 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-30 హైదరాబాద్ ఎ వశె, 8-30 సంగీత సుధ, 8-45 హైదరాబాద్ ఎ వశె, 9-15 చెప్పుకో తగ్గవార్తలు, 9-30 హైదరాబాదు ఎ వశె, 9-45 ఎ. ఎమ్. మాణిక్యవర్మ: వీణ, 10-30 హైదరాబాదు ఎ వశె, 10-35 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి. జనగణమన.

హైదరాబాదు-సి

245.9 మీ (1220 కిలోసై) (వివిధ భారతి)

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ: 6-30 ప్రసారవిశేషాలు 6-40 అం-వా, 6-45 భక్తిరంజని, 6-55 సూక్తిముక్తావళి, 7-00 తె-వా, 7-15 చతురంగం కదంబకార్యక్రమం 7-30 రంగనాయకి రామన్, 8-00 అం-వా 8-15 లలిత సంగీతము. 8-30 హైదరాబాదు వశె,

మ: 12-30 కార్మికుల కార్యక్రమము, 1-00 మహిళాసమాజము, 1-30 లలిత సంగీతం, 1-40 హిం-వా, 1-50 తె-వా,

సా: 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 ప్రస్తుతాంశం, 6-20 గ్రామస్థులకార్యక్రమం, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-30 సరసవినోదిని సమస్యాపూరణం, 7-45 యే భీ మునీబత్ హై ప్రసంగం (హిందీ) రచన: ఉమారావు. 7-55 విరామ సంగీతము, 8-00 నాటిక, 8-30 చిత్రతరంగిణి రికార్డులతో కూర్చినరూపకం సమర్పణ: లత, 8-45 వాద్యబృందం, 8-55 టాపిక్ ఫర్ టుడే, 9-00 అం-వా, 9-15 ఫోకస్, 9-25 విరామ సంగీతం, 9-30 ఢిల్లీ నుండి రిలే, 9-45 లలిత సంగీతం, 10-00 రంగనాయకి రామన్ 10-30 అం-వా, 10-35 వాతావరణ సూచన. ప్రసార సమాప్తి. జనగణమన.

ఇండోర్ స్టేడియం నిర్మాణం

హైదరాబాద్, జులై 26

కొన్ని సాంకేతిక ఇబ్బందుల కారణంగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణం త్వరలో తిరిగి చేపట్టబడనున్నట్లు తెలుస్తున్నది. ఈ స్టేడియం ఇక్కడ ఫతేమైదాన్‌లో నిర్మించబడుతున్నది. సుమారు రూ. 1?.5 లక్షలు ఖర్చయ్యే ఈ స్టేడియం నిర్మాణము 1966 వ సంవత్సరాంతానికి బహుశా పూర్తవుతుంది.

ఫతేమైదాన్ వద్దగల స్విమ్మింగ్ పూల్‌ను విస్తృతీకరించడానికి క్రీడావేత్తల కొరకు ఒక అతిథి గృహాన్ని నిర్మించడానికికూడా యోచన జరుగుతున్నది.

క్రీడాకారుల సమ్మేళనం

ఆంధ్రప్రదేశ్ క్రీడా వ్యవహారాల మండలి ఆధ్వర్యంలో 1966 జనవరిలో క్రీడాకారుల సమ్మేళనం జరుగుతుంది. ఒక రోజుపాటు జరిగే ఈసమ్మేళనములో క్రీడావేత్తలతోపాటుగా క్రీడా శిక్షకులు, క్రీడా రచయితలు, క్రీడా సామగ్రి సంస్థల ప్రతినిధులు, డీలర్లు, అనుబంధ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. క్రీడలకు సంబంధించిన వివిధ సమస్యలనూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను గురించి వీరు చర్చలు జరుపుతారు. రాష్ట్ర క్రీడా సమ్మేళనం ప్రారంభం కావడానికి ముందు "క్రీడావేత్తల దినోత్సవం" పాటించబడుతుందని మండలి కార్యదర్శి శ్రీ వి. వి. నారాయణరావు తెలియజేశారు.

ఇ. ఎం. ఇ.కి అమీర్ అహమద్ ట్రోఫీ

ఇక్కడ జరిగిన కర్నల్ అమీర్ అహమద్ ట్రాఫీ హాకీ టోర్నమెంటు ఫయినల్స్ మ్యాచ్‌లో ఇ. ఎం. ఇ. పాఠశాలజట్టు ఆంధ్రప్రదేశ్ పోలీసు జట్టును ఒక గోల్ ఆధిక్యంతో ఓడించి ట్రాఫీని కైవసం చేసుకున్నది దీనితో కలుపుకొని ఇప్పటికి హాకీ ఛాంపియన్‌షిప్‌ను ఈపడాది ఇ. ఎం. ఇ. జట్టు సాధించింది. ఆట పునఃప్రారంభమైన 18వ నిమిషాలకు లెఫ్టు బ్యాక్ శ్రీ పూవయ్య చేసిన గోల్ ఇ. ఎం. ఇ.కి ఈఘనతను చేకూర్చింది.

ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా కమాండర్ శ్రీ టి. ఎం. నయూద్ విజేతలకు ట్రాఫీని అందజేశారు. హైదరాబాదు మేయర్ శ్రీ ఎం. ఆర్. శ్యామరావు బహుమాన ప్రదానోత్సవానికి అధ్యక్షత వహించారు.

ఇ. ఎం. ఇ. జట్టులో శ్రీయుతులు లక్ష్మణదాస్ రాజేంద్రసింగ్, పూవయ్య, జాన్‌దాస్, హరిబన్స్ సింగ్, కర్నైల్ సింగ్, రజ్వాత్, మాక్ బ్రైడ్, ముత్తప్ప, వెంకటస్వామి, మహేశ్వర్‌లు పాల్గొనగా ఏ. పి. పి. జట్టులో శ్రీయుతులు లతీఫ్, ఖుద్దూస్ మహాదేవరావు, ఇసాక్, వి. ఫ్రాన్సిస్ మహమ్మద్ (సీనియర్), అనవు, హసన్, ఉమాపతి, వెంకటయ్య లు ఆడారు

"బి" డివిజన్ ఫుటుబాల్ లీగ్

ఇక్కడ గోషామహల్ మైదానంలో సిటీ కళాశాల పూర్వ విద్యార్థుల సబ్ జూనియర్స్ లాలాగూడా వర్క్‌షాప్స్ జట్లకుమధ్య జరిగిన 'బి' డివిజన్ ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లో వర్క్‌షాప్స్ జట్టు 15 గోల్స్ చేసి ఘన విజయము సాధించింది. సబ్ జూనియర్స్ ఒక్క గోల్ కూడా చేయలేకపోయారు. తులసీకుమార్ ఒక హాట్ ట్రిక్ తోసహా మొత్తం ఏడుగోల్స్ సాధించాడు. శ్రీహరి, అయోధ్య, టి. కుమార్‌లు చెరి రెండేసి గోల్స్ చొప్పున చేశారు మిగతా గోల్స్‌ను రమేష్, మునుస్వాములు కొట్టారు.

నిజాం కళాశాల మైదానములో డెక్కన్ స్పోర్టింగ్-నిజాం కళాశాల జట్లకుమధ్య జరిగిన మరో మ్యాచ్ 'డ్రా' అయింది. ఉభయజట్లు చెరి రెండు గోల్స్ చేశాయి.

సికింద్రాబాదు తోఫ్‌ఖానా మైదానములో వెహికిల్ సబ్‌డిపో స్టేషన్ వర్క్‌షాప్స్-ఇ.ఎం.ఇ. జట్లకుమధ్య జరిగిన మరో మ్యాచ్ కూడా జయాపజయాలు తేలకుండానే సమాప్తమైంది. ఏ పక్షమూ ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది.

రహీం ట్రాఫీ ఫుట్‌బాల్ టోర్నమెంటు

ఇక్కడ గగన్‌మహల్ మైదానంలో సెంట్రల్ పోలీసు లైన్స్-రైల్వే రిక్రియేషన్ క్లబ్ జట్లకు మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట పేర్కొన్న జట్టు ఒకే ఒక గోల్ ఆధిక్యంతో గెలుపొందింది. ఆర్. ఆర్. సి.ని ఓడించడానికి సి. పి. ఎల్. ఎంతో ప్రయాసపడవలసి వచ్చింది.

సెంట్రల్ పోలీసులైన్స్ జట్టు ఇప్పటికి 14 మ్యాచ్‌లు ఆడి 20 పాయింట్లు తెచ్చుకున్నది. వీటిలో 3 మ్యాచ్‌లలో ఓడిపోయింది. రెండు డ్రా అయ్యాయి. గ్రాస్ హాపర్స్‌కు 19 పాయింట్లు వచ్చాయి ఇప్పటికి వీరు తృతీయ స్థానంలో వున్నారు. ఏ. పి. పి. జట్టు అగ్రస్థానంలో వుంది.

నగరంలో జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు

జబల్పూర్, జులై 26

పద్నాలుగవ జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు 1966 జనవరి మొదటి వారంలో హైదరాబాదులో జరుగనున్నట్లు భారత కబడ్డీ సమాఖ్య కార్యదర్శి శ్రీ ఎస్. కె. దుబె ప్రకటించారు.

జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్స్

బొంబాయి, జులై 26

జాతీయ మరియు అంతర రాష్ట్ర బ్యాడ్మింటన్ ఛాంపియనుషిప్ పోటీలు డిశంబరులో బొంబాయిలో జరుగుతాయి.

పశ్చిమ భారత బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలను నాగపూర్‌లో నిర్వహిస్తారు.

లండన్ ఎగ్జిబిషన్‌లో భారతీయ క్రీడాపరికరాల ప్రదర్శనం

న్యూఢిల్లీ జులై 26

లండన్‌లో ఆగష్టు 10 నుం 21 వ తేదీ వరకు జరుగనున్న అంతర్జాతీయ క్రీడోత్సవం సందర్భంగా ఏర్పాటయ్యే ఎగ్జిబిషనులో భారతదేశంలో తయారు చేసిన వివిధ క్రీడా పరికరాలను ప్రదర్శిస్తారు. మన దేశంలో సిద్ధముచేసిన టెన్నిస్ రాకెట్లు, హాకీ స్టిక్కులు, ఫుట్‌బాల్స్ ఇంకా ఇతర సామగ్రిని ఈ ఎగ్జిబిషన్‌లో భారీ ఎత్తున ప్రదర్శిస్తారు.

విఖ్యాత బాక్సర్ ఫ్రెడ్డీమిక్స్ హత్య

లండన్, జులై 26

ప్రపంచ ప్రఖ్యాత మాజీ బాక్సింగ్ ఛాంపియన్ ఫ్రెడ్డీమిక్స్‌ను ఎవరో లండన్‌లోని ఒక నైట్ క్లబ్ సమీపాన అతని కారులోనే కాల్చిచంపారు. కారు వెనుక ఒకమారణాయుధం పడిఉందట మిక్స్ వయస్సు 46. 1948లో అతడు ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పొందాడు, కాని 1950లోనే ఆ ఛాంపియన్‌షిప్ పోగొట్టుకున్నాడు కూడా.

రాష్ట్రాలలో విద్యా పన్ను విధింపు

ఉపాధ్యాయులకు అధిక వేతనాలు ఇచ్చుటకు అవసరమని కేంద్ర విద్యా మంత్రి

కలకత్తా, జులై 23

త్రిభాషా సూత్రాన్ని విశ్వవిద్యాలయ విద్యాదశవరకూ ప్రవేశపెట్టాలనే నిర్ణయాన్ని ప్రభుత్వము ఇంకా తీసుకొనలేదని కేంద్ర విద్యా మంత్రి శ్రీ యం.సి. ఛాగ్లా ఇచ్చట వెల్లడించారు.

విశ్వవిద్యాలయ దశవరకూ ఇంగ్లీషును, హిందీని విధిగా చదవాలని నిర్ణయిస్తారా అని పత్రికా విలేఖరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ శ్రీ ఛాగ్లా ఇటువంటి నిర్ణయాన్ని కాంగ్రెసు కార్యవర్గము తీసుకొన్నదని, ప్రభుత్వం మాత్రము ఇటువంటి నిర్ణయాన్ని తీసుకొనలేదని చెప్పారు. త్రిభాషా సూత్రానికి సంబంధించిన బిల్లుఒకటి రానున్న లోకసభ సమావేశములో ప్రతిపాదించబడుతుందన్నారు.

అలిఘర్ విశ్వవిద్యాలయ ఆర్డినెన్స్ కాలపరిమితిముగియకపూర్వమే అలిఘర్ విశ్వవిద్యాలయ చట్టములో తీవ్రమైన మార్పులు తీసుకొనివచ్చుటకు వీలుగా ఒకబిల్లు లోకసభ సమావేశములో ప్రతిపాదింపబడుతుందని కూడా వీరు వెల్లడించారు.

పశ్చిమ బెంగాల్ కళాశాలల విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు తమను కలుసుకున్న సంఘటనను ఉటంకిస్తూ శ్రీ ఛాగ్లా ఉపాధ్యాయులమీద తమకు ఎంతో సానుభూతి ఉన్నదని అన్నారు.

(కాలేజీ ఉపాధ్యాయులకు ట్యూటర్ - డిమాన్‌స్ట్రేటర్‌లకు ఒకే వేతనాలస్కేలుఉండాలని, వేతనాలను పెంచాలని కోరుతూ ఉపాధ్యాయ ప్రతినిధులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు).

ఉపాధ్యాయులు వేతనాలిచ్చేఖర్చును భరించటానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా పన్నును వసూలుచేసి వలసినసొమ్మును సేకరించాలని సేకరించారు కేంద్రం బాధ్యత తీసుకొనజాలదు అని మంత్రి స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల వేతనాలు, వారి హోదా పెరుగాలన్నారు. "ఉత్తమ ఉపాధ్యాయులకు లేకపోతే ఉత్తమ విద్యా విధానం రూపొందదు". కనుక కనుక సివిల్ ఉద్యోగులకిచ్చే ప్రాధాన్యాన్ని, వేతనాలను ఉపాధ్యాయులకు ఇవ్వాలని శ్రీ ఛాగ్లా వివరించారు.

రాజకీయాలను విద్యకు దూరంగా ఉంచటం అవసరమని తమ నిశ్చితాభిప్రాయమన్నారు విద్యా మంత్రి. అలిఘర్ విశ్వవిద్యాలయం తదితర విశ్వవిద్యాలయాలలో జరిగిన సంఘటనలు ఈ అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు.

విక్టోరియా మెమోరియల్ స్వాతంత్ర్యానంతరం భారతదేశం సాధించిన అభివృద్ధిని సూచించే 'మహోన్నత జాతీయ చిహ్నం' అన్నారు. ఇది బ్రిటిష్ పాలనాకాలపు రికార్డులను భద్రపరచటంతోపాటు స్వతంత్ర భారతము సాధించిన ఘనకార్యాలను నమోదుచేయగలదని కూడా విద్యా మంత్రి అన్నారు.

....

ఇండియా సూపర్ సానిక్ యుద్ధ విమానాలకు బ్రిటిష్ పరికరాలు

లండన్, జులై 26

హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ వారు బెంగుళూర్ కర్మాగారములో నిర్మిస్తున్న 60 మారట్-హెచ్.ఎఫ్.-24 యుద్ధ విమానాల్లో ప్రతి ఒక్కదానికి బ్రిటిష్ సంస్థ ఒకటి తయారు చేసిన హైడ్రాలిక్ పెస్టు ఫ్లయింగ్ కంట్రోల్ పరికరాలను అమర్చుతారు. ఈ పరికరాలను లండన్‌లోని ఫెయిరీ హైడ్రాలిక్స్ సంస్థ తయారు చేస్తున్నది. మారట్ రకం విమానాలలో మొదటి దాని పరీక్ష ఇటీవల జరిగినది. కామన్వెల్తు దేశాలూ తదితర దేశాలలోని 4,000 విమానాలకు ఫెయిరీ సంస్థ రూపొందించిన కంట్రోల్ పద్ధతిని అమర్చినారు.

....

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల

ఆగస్టు 16 నుండి ప్రారంభం

హైదరాబాదు, జులై 26

ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల ఆగస్టు 16 వ తేదీ నుండి ప్రారంభించబడుతున్నది.

ఆంధ్రసారస్వత పరిషత్తు భవనములో జరిగే ఈ ప్రాచ్య కళాశాలలో డిప్. ఓయల్, బి.ఓ.యల్, మొదటి సంవత్సరము తరగతులు ప్రారంభించబడుతాయి. ఈతరగతులలో చేరదలచు విద్యార్థులు ఆగస్టు 10 తేదీలోగా ప్రవేశరుసుము 10 రూ. చెల్లించి ప్రవేశపత్రములను పంపాలి.

ఈ కళాశాలకు ఆచార్య శ్రీ సర్విపెల్లి విశ్వనాథశాస్త్రి ప్రధానాచార్యులుగా ఉందురు. సుప్రసిద్ధ పండితులు, అనుభవజ్ఞులు ఇందు అధ్యాపకులుగా పనిచేస్తారు.

తరగతులు సాయంకాలము 6 గంటలనుండి 10 గంటల వరకు నడుస్తాయి. ఈ మొదటి సంవత్సరము విద్యార్థులకు ప్రవేశ రుసుము తప్ప ఇతర రుసుములు ఉండవు.

....

టెహరాన్ బస్ ప్రమాదములో పదునలుగురి మృతి

టెహరాన్, జులై 26

ఇంజన్ చెడిపోయి ఆగివున్నలారీని, వెనుక వస్తున్న ప్రయాణీకుల బస్సు గుద్దుకొనటంవల్ల, ప్రయాణీకులలో 14 గురు మృతిచెందారు; 32 మందిగాయపడ్డారు. లారీ లైట్లు ఆర్పివుండటము చేత బస్సు డ్రైవరు లారీని చూడలేకపోవటంచేత ఈ ప్రమాదం జరిగింది.

6వ సంయుక్త వారం
గౌరి ప్రొడక్షన్స్:
ఆకాశరామన్న
దర్శకత్వం: జి. విశ్వనాథం. సంగీతం: కోదండపాణి
తా: కాంతారావు, రాజశ్రీ, రాజనాల, రామకృష్ణ, ఎల్. విజయలక్ష్మి, మీనాకుమారి.
అశోక్ హైదరాబాద్ రాజేశ్వర్ సికింద్రాబాద్
ఆటలు: 2-00, 5-45, 9-15
3వ వారం! మార్కండేయ వరంగల్
-పూర్ణా పిక్చర్స్ రిలీజ్.

17వ సంయుక్త వారం

తా: ఎన్. టి. రామారావు, రేలంగి, బి. సరోజాదేవి, గిరిజ, రాజశ్రీ, కాంతారావు, పద్మనాభం.
రాహత్-ముషీరాబాద్ ఆటలు: 6-00, 9-30
సత్యటాకీస్-బొలారంరోడ్, అల్వాల్ రోజు 3 ఆటలు: 2-30, 6-00, 9-30
మరియు రామా సుందర్ వరంగల్ ఖమ్మంమెట్

నేడే చూడండి:
అన్నపూర్ణావారి అత్యుత్తమ సాంఘిక చిత్రం:
తోడు కోడళ్ళు
దర్శకత్వం: ఆదుర్తి సుబ్బారావు
నిర్మాణం: డి మధుసూధనరావు B.A.
తా: ఎ నాగేశ్వరరావు, ఎస్. వి. రంగారావు, జగ్గయ్య, రేలంగి, సావిత్రి, రాజసులోచన, సూర్యకాంతం.
ప్యారడైజ్-సికింద్రాబాద్ ఆటలు. 2-30, 6-00, 9-30
—నవయుగ.

3వ వారం
ఎస్. వి. ఫిలిమ్స్ వారి:
ఏక్ సాల్ పహిలే

దర్శకత్వం: ధరంకుమార్.
సంగీతం: సి. అర్జున్.
రాయల్-హైదరాబాద్ ఆటలు: 3-30, 6-30, 9-30
మరియు అప్సర ఔరంగాబాద్
-ధనలక్ష్మి పిక్చర్స్ రిలీజ్.

నేడే చూడండి! నేడే చూడండి!


బసంత్-హైదరాబాద్ ఆటలు: 2-30, 6-00, 9-30.
—వాణి రిలీజ్

నేడే చూడండి నేడే చూడండి


కమల్-హైదరాబాద్ ప్రతిరోజు 3 ఆటలు: 2-30, 6-00, 9-30
—వాణి రిలీజ్.

లూప్—కొత్త, సులభమైన మరియు ఉచితమైన కుటుంబ నియంత్రణ పద్ధతి. మీకు దగ్గరగా వున్నవద్ద విచారణ చెయ్యండి కుటుంబ నియంత్రణ సంక్షేమ కేంద్రము DA 65/193

బహిరంగ ప్రకటన

వాళ్లయింట్స్ శ్రీ వెంకటరమణ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటి (టి. ఎ. నెం. 95 గా రిజిష్టరయినది) దిగువ యివ్వబడిన "ఎ" షెడ్యూల్‌లో పేర్కొన్న షుమారు 20 ఎకరములు శ్రీమతి సి. రాజలక్ష్మిదేవి, భర్త: లక్ష్మణరావు (2) శ్రీమతి ఎన్. పద్మసానిబాయ్, భర్త: జనార్దనరావు నుండి మరియు దిగువ యివ్వబడిన "బి" షెడ్యూల్‌లోని 8 ఎకరములు శ్రీ పి. వెంకటేశ్వరరావు నుండి కొనుటకు నిశ్చయించుకొని 12-6-1965 తేదిన రెండు విడిగా అమ్మకపు అగ్రిమెంట్లు వ్రాయించుకోనైనది.

పైన పేర్కొన్న "ఎ" & "బి" షెడ్యూల్స్‌కు సంబంధించి ఎవరికయిన వివిధమైన హక్కు లేక ఆక్షేపణ లేక ప్రతిపాదితమైన అమ్మకమునకు వివిధమైన అభ్యంతరం వున్న యెడల అట్టి వాటిని ప్రకటన తేదినుండి వారంరోజుల లోపు దిగువ సంతకం చేసినవారికి తెలియపరచవలెను గడువుతరువాత వచ్చే ఆక్షేపణలు, అభ్యంతరములు పరిశీలించబడవు.

"ఎ" షెడ్యూల్

హైదరాబాద్ వెస్టు తాలూకా, యూసఫ్‌గూడ గ్రామం యొక్క సర్వే నెం: 128/1 లో వున్నట్టి షుమారు 20-00 ఎకరములభూమి మరియు దిగువహద్దులలో గలది.

తూర్పు: కొంతవరకు శ్రీ పి. వెంకటేశ్వరరావు భూమి మరియు కొంతవరకు సత్యనారాయణరాజు భూమి.
దక్షిణం: కళ్యాణనగర్ కోఆపరేటివ్ సొసైటి భూమి.
పడమర: ,, ,,
ఉత్తరం: ,, ,,

"బి" షెడ్యూల్

హైదరాబాద్ వెస్టు తాలూకా, యూసఫ్‌గూడ గ్రామం యొక్క సర్వే నెంబర్లు: 128/2 మరియు 128/5 లలో వున్నట్టి షుమారు 8-00 ఎకరముల భూమి: మరియు దిగువహద్దులలో గలది.

తూర్పు: శ్రీ సి. హెచ్. రామలింగేశ్వరరావు తదితరులకు చెందిన భూమి.
దక్షిణం: విద్యుత్ శాఖకు చెందిన భూమి.
పడమర: శ్రీమతులు: రాజలక్ష్మిదేవి మరియు పద్మసానిబాయ్‌ల భూమి.
ఉత్తరం: శ్రీ సత్యనారాయణరాజు తదితరుల భూమి.

నెం: 5-8-351;
చిరాగ్‌అలీలేన్, హైదరాబాద్
తేది: 26-7-1965

కె. సూర్యనారాయణ
అడ్వొకేట్.

29-7-65 గురువారం
ఉ॥ 12-30 గంటల ఆటతో గొప్ప ప్రారంభం
సుదర్శన్ చిత్రా సమర్పించు
దారాసింగ్ & ముంతాజ్ నటించిన
బాక్సర్

తా॥ తబునమ్, షేరి, రాజ్‌కపూర్, కమ్మో, మృదుల, కేసరి.
సంగీతం: లక్ష్మీకాంత్ ప్యారేలాల్
దర్శకత్వం: రాధాకాంత్
నిర్మాణం: ద్వారకదాస్, శ్రీనాథ్‌దాస్
అశోక్ హైదరాబాద్ — నటరాజ్ సికింద్రాబాద్
ప్రతిరోజు 4 ఆటలు: 12-30, 3-30, 6-30, 9-30.
—సుందర్ పిక్చర్స్ సర్క్యూట్ రిలీజ్.

నేడే చూడండి నేడే చూడండి

రోజు 3 ఆటలు: 2-15, 6-00, 9-30

Edited Printed and Published by N. Narotham ReddyM. A. forthe Golkonda Publications Ltd. Golkonda Printing Press Hydrabad (A. P.)

దేశీయ విడిభాగాలతో టెలివిజన్ సెట్ల తయారీ

కేంద్ర ఎలక్ట్రానిక్సు ఇంజనీరింగు పరిశోధనాసంస్థ సాధించిన విజయం

న్యూఢిల్లీ, జులై 26

టెలివిజన్ సెట్లు, వాటి కవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలు తయారు చేయడానికి రాజస్థాన్‌లోని సైలమ్‌లోని కేంద్ర ఎలక్ట్రానిక్సు ఇంజనీరింగు పరిశోధనా సంస్థలో నెలకొల్పిన నమూనా ఫ్యాక్టరీ ఇటీవలే ఉత్పత్తి ప్రారంభించింది. సామూహిక ప్రచార కార్యక్రమాలకూ, వినోద కార్యక్రమాలకూ టెలివిజన్ అతి ప్రధానమైన సాధన మన్న విషయము ప్రత్యేకముగా చెప్పనవసరము లేదు. టెలివిజన్ సెట్ల తయారీకి అవసరమైన సాంకేతిక విజ్ఞానము కోసము విదేశీయులమీద ఆధారపడడమువల్ల, అసలే తక్కువగా ఉన్న మన విదేశ మారకము నిలవలు ఖర్చు అవడమే గాక, మన అభ్యుదయానికికూడ అవరోధముగా ఉంటున్నది. ఈ విషయాలన్నింటినీ గుర్తించి కేంద్ర ఎలక్ట్రానిక్సు ఇంజనీరింగు పరిశోధనా సంస్థ ఈ రంగములో మార్గ దర్శకత్వము వహించింది. దేశీయ పరికరాలనువీలైనంత హెచ్చు మొత్తములో పరిశోధనలకు వినియోగించి, సాధ్యమైనంత తక్కువగా విదేశ మారక ద్రవ్యాన్ని వినియోగిస్తూ, ఈ సంస్థ పరిశోధనా కృషిని కొనసాగిస్తున్నది. ఈసంస్థ చేపట్టిన ప్రాజెక్టు ఆర్థికముగానూ, సాంకేతికముగానూ, నిర్వహించడము సాధ్యమని దృఢ నిర్ణయానికి వచ్చి, ప్రచారార్థముగా ఈ పథకాన్ని అమలు పరిచింది.

టెలివిజన్ సెట్లు నమూనాలు రూపొందించడములోనూ, వాటిని ఉత్పత్తి చేయడంలోనూ, విడిభాగాలు ఎంచుకోడములోనూ, వైరింగు ఏ విధముగా ఉండాలన్న విషయంలోనూ వాటి సంరక్షణ విషయములోనూ, ఈ సంస్థ ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఇంటర్ క్యారియర్ సిస్టమునను సరించి ఆమోదించిన ప్రమాణాల ననుసరించి యీసంస్థ టెలివిజన్ సెట్లను తయారు చేస్తున్నది ట్రాన్స్‌ఫార్మర్లు, కాయిల్స్ మొదలైనవాటి నమూనాలను రూపొందించి, ఈసంస్థ ఉత్పత్తి చేస్తున్నది. టెలివిజన్ సెట్టుఖరీదు (ఎక్సైజ్ సుంకం మినహాగా) 800 రూపాయలు. అందులో 150 రూపాయల విలువగల భాగాలు మాత్రమే విదేశాలనుంచి దిగుమతి చేసుకోబడ్డాయి. అంటే ఈసెట్ల ఉత్పత్తికి విదేశమారకద్రవ్యం కనీస మొత్తము మాత్రమే ఈ సంస్థ వ్యయ పరుస్తున్నది. ఒక ఏడాది తరువాత సాలుకు వెయ్యి టెలివిజనుసెట్లు తయారు కాగలవు.

విడి భాగాలన్నింటినీ దిగుమతి చేసుకుని, టెలివిజన్ సెట్టును అమర్చే పక్షములో, దాని వ్యయము ఈ సంస్థ తయారుచేసే సెట్టు వ్యయము కంటె 500 రూపాయలు ఎక్కువవుతుంది. మనదేశములోని ఇతర ప్రధాన నగరాలకు కూడ టెలివిజన్ సౌకర్యాలను విస్తరింప చేయడానికి నిర్ణయించినందున వచ్చే పదేళ్ళలో మూడు నుంచి ఐదులక్షల టెలివిజన్‌సెట్లు అవసరము కాగలవు. వాటన్నింటినీ, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న విడిభాగాలతో కూర్చేట్లయితే, అదనముగా 20కోట్ల రూపాయలవుతాయి. మన దేశములో తయారైన నమూనాను ఉపయోగించి, సెట్లు తయారుచేస్తే, పై మొత్తము అంతా ఆదా కాగలదు.

మొత్తం 55 వంతుల విదేశ మారక ద్రవ్యము ఆదా కాగల టెలివిజన్ సెట్టు తయారు చేయడములో ఈసంస్థ ఘన విజయాన్నే సాధించింది. నాణ్యము తగ్గకుండా, చవుక ధరకు టెలివిజన్ సెట్లు తయారు చేయడములో ఈసంస్థ సాధించిన విజయము ఎలక్ట్రానిక్సు రంగములో ప్రముఖ సంఘటన అని చెప్పాలి.

దక్షిణ మండలంలో కంపెనీ శాసన వ్యవహారాలు

మద్రాసు, జులై 26

జూన్ 30వ తేదితో అంతమైన మొదటి మూడు నెలల కాలములో ఆంధ్రప్రదేశ్, కేరళ, మద్రాసు, మైసూరు రాష్ట్రాలతో కూడిన దక్షిణ మండలంలో మొత్తం రూ. 1920.20 లక్షలు అనుమతించిన మూలధనతో 53 కంపెనీలు రిజిష్టరు అయ్యాయి. వీటిలో 11 పబ్లిక్ కంపెనీలు, వీటి అనుమతించిన మూలధనము రూ. 1757.30 లక్షలు. మిగతావి ప్రైవేటు కంపెనీలు, ఈ 42 ప్రైవేటు కంపెనీల అనుమతించిన మూలధనము రూ. 162.90 లక్షలు కొత్తగా రిజిష్టరయిన ఒకటి కంపెనీలలో కోటి రూపాయలు అనుమతించిన మూలధనముతో ఆంధ్ర ప్రదేశ్‌లో ఏర్పాటైంది.

ఎ. ఐ. సి. సి. లో మూర్ఛపోయిన మహిళ

బెంగుళూరు, జులై 26

నిన్న ఎ. ఐ. సి. సి. సమావేశంలో ప్రధాని శ్రీ శాస్త్రి తన గంట ఉపన్యాసం ఇస్తుండగా ఒక మహిళా ప్రతినిధి మూర్ఛపోయింది. అది ప్రధాని శ్రీ శాస్త్రి చూసి తన ప్రసంగాన్ని ఆపి ఆమె మూర్ఛపోయిన విషయం ప్రస్తావించారు. వెంటనే పలువురువేదికపాయానికి పరుగెత్తుకోయారు ఇంతలో మైసూరు ఆరోగ్యమంత్రి డా॥ నాగప్ప అల్వా ఆమెవద్దకు వెళ్ళి పరీక్షించారు. శ్రీ శాస్త్రి ఆమెను వెలుపలికి కొంపోయి వైద్యపరీక్ష చేయాల్సిందిగా సైగచేసి తన ప్రసంగాన్ని కొనసాగించారు.

తరువాత కొంతసేపటికి ఆమె కోలుకుంది. ఆమె పశ్చిమ బెంగాల్ శాసన సభ్యురాలు శ్రీమతి లీకేన్ మిత్రా.

వరిపంట దిగుబడి పోటీలు

మహారాష్ట్రరైతుకు ప్రథమ బహుమతి

న్యూఢిల్లీ, జులై 26

1964-65వ సంవత్సరం దాళవా పంట కాలానికిగాను దేశంమొత్తం మీద ఏర్పాటయిన వరిపంట దిగుబడి పోటీలలో మహారాష్ట్రకు చెందిన శ్రీ శ్రీ ఎ. కె. నిర్గుడ్కర్‌కు ప్రథమ బహుమతి లభించింది. నాగపూర్ జిల్లాలోని మంధర్ గ్రామానికి చెందిన ఈ వ్యవసాయదారుడు ఎకరానికి 8664.955 కిలోగ్రాముల వరిధాన్యం పండించారు. ఈపోటిలో ప్రథమ బహుమతి లభించిన వారికి "కృషి పండిట్" బిరుదు ప్రదానంచేసారు.

ఎకరానికి 8845.124 కిలోగ్రాముల బియ్యం పండించిన శ్రీ డి. ఎ. నాయక్‌కు (మహారాష్ట్ర. నాగపూర్ జిల్లా, ఉర్నల్ తాలూకు సిల్లి గ్రామం) ద్వితీయ బహుమతి, ఎకరానికి 2,125.477 కిలోగ్రాముల బియ్యం పండించిన శ్రీ కె నాబీ సాహెబ్‌కు (ఆంధ్రప్రదేశ్, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు గ్రామం) తృతీయ బహుమతి లభించాయి.

హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

కార్యదర్శి కార్యాలయం

తేది: 26-7-1965

తేది 30 జులై 1965 శుక్రవారం పగలు మూడు గంటలకు దారుష్షిఫాలోని కార్పొరేషన్ హాలులో జరిగే మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో ఈ దిగువ తీర్మానాలు గూడా పరిశీలింపబడుతాయి:-

(65) మున్సిపల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్స్ పోస్టు ఉద్యోగాల రద్దుకు మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ దేవేంద్రపూరి గోస్వామి తీర్మానం.

(66) మున్సిపల్ లిమిట్స్‌లో జాతీయనాయకుల విగ్రహాల ప్రతిష్ఠాపనకై విరాళాల సేకరణకు మేయర్ అధ్యక్షతన కొరకమిటిని ఏర్పరచుటకై మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ దేవేంద్రపూరి గోస్వామి ప్రతిపాదించిన తీర్మానం,

(67) 1955 హెచ్. ఎం. సి. చట్ట ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందనిది ప్రభుత్వ లేక ప్రభుత్వేతర స్కూళ్ళను నడుపకుండా నిరోధించాలనే మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ దేవేంద్రపూరి గోస్వామి తీర్మానం.

(68) ప్రయివేటు మోటార్‌కార్లు అగేస్థలములందు పార్కింగ్ మీటర్ల అమర్చాలనే మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ దేవేంద్రపూరి గోస్వామి తీర్మానం.

(69) కార్పొరేషన్‌చేసే తీర్మానాల అమలుపరచని కారణాల పరిశీలించేందుకు ఒక అడ్‌హాక్ కమిటిని ఏర్పరచాలనే మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ దేవేంద్రపూరి గోస్వామి తీర్మానం.

కార్యదర్శి

ధాన్య వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టాలి

కలకత్తాలో ప్రజాప్రదర్శనలు

కలకత్తా, జులై 26

ధాన్య వ్యాపారాన్ని ప్రభుత్వము మాత్రమే సాగించాలని, ఆహార ధరలను ఖచ్చితముగా అమలు జరపాలని కోరుతూ, సుమారు 500 ప్రజలు నిన్న రాజభవన్ ఎదుట ప్రదర్శన చేశారు. ప్రదర్శకులలో స్త్రీలుకూడా అధికముగా ఉన్నారు.

ఈప్రదర్శన ప్రజా సోషలిస్టుపార్టీ అధ్వర్యాన జరిగింది.

దొంగతనముగా దాచిన ఆహార ధాన్యాల్ని వెలికి తీయించాలని, రేషనింగు లేని ప్రాంతాలలో ఎక్కువ దుకాణాల్ని తెరవాలని గవర్నరుకు సమర్పించిన వినతిపత్రములో వీరు పేర్కొన్నారు.

హిందీ వాచస్పతి ఫలితాలు

గత మే నెలలో హైదరాబాద్ హిందీ ప్రచారసభ వారు జరిపినహిందీ వాచస్పతి పూర్వార్ధ-ఉత్తరార్ధ పరీక్షా ఫలితాలు దిగువ ఇవ్వబడుతున్నాయి:

పూర్వార్ధ

2 ధన్నాదేవి, 3 పోసెట్టి, 5 కె. నాగభూషణం, 6 జి. రామకృష్ణరావు 7 కె. మల్లయ్య, 10 ఎం.కె. రాఘవన్ నాయర్, 13 వి.ఆర్. సరస్వతీ అమ్మ.

ఉత్తరార్ధ

ద్వితీయశ్రేణి: 1 వి. శకుంతల, 2 కె.ఎస్. రేణుకారావు, 3 ఎస్. వర్సోజి, 4 వి.రంగాచార్యులు, 5 కె.సుబ్బారావు, 6 ఎస్. కాపిరాజు, 7 ఆర్. సుబ్బావధానులు, 8 ఆర్. శ్రీధరన్.

వేదాంతవర్ధినీ సంస్కృత కళాశాల విద్యార్థి సంఘ ఎన్నికలు

హైదరాబాదు, జులై 26

వేదాంతవర్ధనీ సంస్కృత కళాశాల విద్యార్థి సంఘ ఎన్నికలు శ్రీ అణ్ణంగరాచార్యులయధ్యక్షతన ఇటీవల జరిగినవి. క్రింద సూచించబడిన సంఘ సభ్యులు ఎన్నికైనారు. అధ్యాపక బృందంనుండి, శ్రీ సముద్రాల శ్రీనివాసాచార్యులు గౌరవాధ్యక్షులుగా ఉంటారు.

సంఘాధ్యక్షులు పంతంగి అనంత రామశర్మ,ఉపాధ్యక్షులు కె గోపాలాచార్యులు, కార్యదర్శి ఎం. లక్ష్మణాచార్యులు, ఉప కార్యదర్శి డి. టి. వెంకటరమణాచార్యులు, సభా కార్యదర్శి డి ప్రభాకరశర్మ.

సభ్యులు: జి వెంకట నృసింహాచార్యులు, కోపి కృష్ణశర్మ, వై. సత్యనారాయణశర్మ, కె. కె. ఎ. రంగాచార్యులు, కె. రఘురామశర్మ, కె. నర్సింహాశర్మ.

అచ్చంపేట సమితి సమావేశం

అచ్చంపేట, జులై 26

అచ్చంపేట సమితి సమావేశము మన్ననూరులో ఈనెల 17, 18 తేదిలలో జరిగింది. సమితి అధ్యక్షులు శ్రీ యం. గోపాల్ రెడ్డి అధ్యక్ష్యమున సభ్యులు వివిధ కార్యరంగములలో అభివృద్ధిని పరిశీలించారు.

గ్రామ పంచాయతీలలో జరుగుచున్న కార్యక్రమములు నియమిత కాలములో జరుగునట్లు సర్పంచులు శ్రద్ధవహించవలెననితీర్మానించబడింది. ఈ సంవత్సరము ఏ పద్దుక్రింద విడుదల అయిన ధనం కానీ పూర్తిగా వినియోగము కావాలని నిర్ణయించబడింది.

సమితి సభ్యులందరు శ్రీశైల యాత్రి కావించి శ్రీ మల్లికార్జున స్వామి దర్శనము చేసుకున్నారు. శ్రీశైల ప్రాంతములో జరుగుచున్న కార్యక్రమములను తిలకించి డ్యామ్ సైటువద్ద విద్యుచ్ఛక్తి సరఫరా ప్రతిపాదనలలో అచ్చంపేట సబ్ స్టేషన్‌గా లేకపోవడం తీరని కొరత అని అభిప్రాయ పడినారు. ప్రాజెక్టు అధికారులు విద్యుచ్ఛక్తి సరఫరా ప్రతిపాదనలో అచ్చంపేటను దృష్టి యందుంచుకొని దీనిని సబ్ స్టేషన్‌గా గుర్తించవలయునని వీరు కోరుతున్నారు.

సమితి సమావేశమును మన్ననూరులో నిర్వహించి యాత్రకు ఏర్పాటు చేసిన శ్రీ మూరయ్య సర్పంచ్, శ్రీ ఎ రామకృష్ణారెడ్డి, శ్రీ భీమయ్యలను సమితి అధ్యక్షులు అభినందించారు.

హైదరాబాద్, జులై 26

ఆసిఫ్‌నగర్ గవర్నమెంటు మిడిల్ స్కూలు విద్యార్థుల సంఘం ఎన్నికలు ఈ రోజున జరిగినవి. ఈ క్రింది వారు ఎన్నికఅయ్యారు:

ఎ. ఎస్. దేసిన్: వైస్‌ప్రెసిడెంట్. ముజహారుద్దిన్: సెక్రటరీ, బాలయ్య జాయింట్ సెక్రటరీ. ఎస్. విజయ కుమార్: కోశాధికారి.

ప్రేక్షకులు, పత్రికలచే పొగడబడు చున్నది
నేడే చూడండి!
కోదండపాణి సంగీతంవిని ఆనందించండి....



తా॥ ఎన్. టి. రామారావు. సావిత్రి. పద్మశ్రీ నాగయ్య, నిర్మల, పద్మనాభం, గీతాంజలి, మాస్టర్ మురళి (యూనిస్ ది డాగ్), వంగర.
నిర్మాణం: బి. పురుషోత్తం — సంగీతం: ఎస్. పి. కోదండపాణి
దర్శకత్వం: కె. హేమాంబరధరరావు
సాగర్ హైదరాబాద్ — అంజలి సికింద్రాబాద్
ఆగస్టు 1వ తేది వరకు ప్రతిరోజు 4 ఆటలు:
ఉ॥ 10-30, 2-30, 6-00, 9.10
మరియు లక్ష్మి-వరంగల్ అశోక్-నిజామాబాద్
—వాణి రిలీజ్

30-7-65 శుక్రవారం మ॥ 12-30 కు గొప్ప విడుదల
నృత్య, సంగీత, సన్నివేశములతో నిండిన చిత్రం
డిమ్‌ప్లే ఫిలిమ్స్:
ఏక్ సపేరా ఏక్ లుటేరా
తా॥ ఫిరోజ్‌ఖాన్, కుమ్ కుమ్, ఉమాదత్, సుందర్.
నిర్మాత అండ్ దర్శకుడు: నరేష్‌కుమార్ — సంగీతం: ఉషాఖన్న
దిల్‌షాద్ హైదరాబాద్ — అజంతా సికింద్రాబాద్
శుక్ర, శని, ఆదివారం 4 ఆటలు: 12-30, 3-30, 6-30, 9-30
మరియు ప్రకాష్- గుల్బర్గా — మెజెస్టిక్ - జాల్నా

—శ్రీ సిని కార్పొరేషన్ రిలీజ్.

రీగల్ - హైదరాబాద్ * ప్యారడైజ్ - సికింద్రాబాద్
ఆటలసమయములు: 2.30, 6.00, 9.30 —నవయుగ